

గొమ్ముగూడెం గ్రామస్థులను పునరావాస కాలనీకి తరలిస్తున్న దృశ్యం

ఇటు గోదావరి.. అటు కొల్లేరు



కొల్లేరు ఉధృతికి నీట మునిగిన కైకలూరు-ఏలూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు

- తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఒడిశాల్లో భారీ వర్షాలు
- పొంగుతున్న ఉపనదులు.. గోదావరిలోకి భారీగా వరద జలాలు
- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దిశగా ప్రవాహం
- కుక్కునూరు-వేలేరుపాడు మండలాలకు పొంచివున్న ప్రమాదం
- ముంపులో గ్రామాలు.. రాకపోకలు బంద్
- నీటమునిగిన కడెమ్మ స్లూయిజ్ గేట్లు

తరుముకొస్తోంది

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం, సెప్టెంబరు 5: తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదికి వరద పోటెత్తుతోంది. తాళిపేరు, శబరి ఉప నదుల పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు లక్షలాది క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. చత్తీస్‌ఘడ్‌లో భారీ వర్షాల కారణంగా తాళిపేరు నదికి భారీగా వరద చేరుకోవడంతో 16 గేట్లు ఎత్తి దిగువన ఉన్న గోదావరిలోకి 95 వేల క్యూసెక్కుల నీటిని వదిలివేస్తున్నారు. మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలలోని శబరి పరివాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు శబరినదికి భారీగా వరద పొటెత్తుతుంది. శబరి, గోదావరి సంగమం కూనవరం వద్ద శబరి నది ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. వీటి కారణంగా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరుతోంది. భద్రాచలం వద్ద గురువారం సాయంత్రానికి 46 అడుగులకు నీటిమట్టం చేరుకోగా మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను హెచ్చరిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళాలని హెచ్చరికలు జారీ చేశారు. వరద ప్రభావం కారణంగా వేలేరుపాడు మండలంలో 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు - రుద్రమ్మకోట, వేలేరుపాడు-రేపాకగొమ్ము, వేలేరుపాడు-కోయిదా మధ్యగల రహదారులపై వరదనీరు చేరుకోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య పర్యవేక్షణలో లోతట్టు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా అప్రమత్తం చేస్తున్నారు.



కుక్కునూరు మండలం చివ్వాక ప్రాంతంలో గోదావరి వరద

పునరావాస కేంద్రాలకు తరలింపు

కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామానికి చెందిన దాదాపు 100 కుటుంబాలను దాచారం పునరావాస కాలనీకి తరలిస్తున్నారు. గొమ్ముగూడెం నిర్వాసితులకు దాచారం పునరావాస కాలనీలో ఆర్డీవో అద్దయ్య నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గొమ్ముగూడెంలో 220 కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 100 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు ఆర్డీవో తెలిపారు. మిగిలిన వారిని తరలిస్తామన్నారు. వారం క్రితమే దాచారం పునరావాస కాలనీ నుంచి గొమ్ముగూడెం వాసులు ఇంటికి వెళ్ళారు. అంతలోనే వరద మళ్ళీ ముంచుకురావడం తిరిగి పునరావాస కాలనీకి వెళ్ళే పరిస్థితి ఏర్పడింది. తచ్చిగూడెం గ్రామస్తులకు 120 కుటుంబాలకు 25 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. కేజీ కంది పప్పు, కేజీ పంచదార, లీటరు పామాయిల్, కేజీ ఉల్లి పాయలు, కేజీ బంగాళాదుంపలు, 5వేలు మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. గొమ్ముగూడెం బాధిత కుటుంబాలకు పునరా వాస కాలనీల్లోనే భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ప్రజలను అవసరమైతే తరలించడానికి 10 మోటార్ బోట్లను, 35 ట్రాక్టర్లు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు భారీగా వరద కుక్కునూరు కొత్తచెరువు అలుగుకు వచ్చి చేరడంతో మట్టి కొట్టుకుపోయి గండిపడింది. చెరువు కింద పొలాలు దెబ్బతిన్నాయి.

దీని ప్రభావం వల్ల తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే మార్గంలో పంట పొలాలు ఈ సీజన్‌లో మూడోసారి నీటమునిగాయి. ఎల్ఎన్‌డీపేట కొవ్వాడ రిజర్వాయర్‌లోకి కొండవాగుల జలాలు చేరడంతో నీటిమట్టం 89.95 మీటర్లకు చేరుకుంది. అదనంగా వసున్న 360 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. దీంతో పోలవరం, దొండపూడి గ్రామాల నుంచి కన్నాపురం, జంగారెడ్డిగూడెం మార్గాల్లో సాగిపాడు, కన్నాపురం కల్వర్టులపై వరద జలాలు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది.



పోలవరం వద్ద నీట మునిగిన పంటపొలాలు

నీటమునిగిన కడెమ్మ స్లూయిజ్ గేట్లు

పోలవరంలో గోదావరి నీటిమట్టం పెరగడంతో కడెమ్మ స్లూయిజ్ గేట్లు పూర్తిగా నీటమునిగాయి.



మండవల్లి మండలం నందిగామలంకలో కొల్లేరు ముంపులో ఇళ్లు

నీట మునిగిన ఏలూరు-కైకలూరు రోడ్డు

- నిలిచిన రాకపోకలు .. వేరే రూట్లలో బస్సులు
- బాహ్య ప్రపంచానికి దూరంగా లంక గ్రామాలు
- క్షణక్షణం భయం భయంగా గడుపుతున్న ప్రజలు

కైకలూరు/మండవల్లి/ఏలూరు క్రైం/చాట్రాయి, సెప్టెంబరు 5 : వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొల్లేరు నీటిమట్టం పెరిగి లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. విజయవాడ ఎగువ ప్రాంతాల నుంచి తమ్మిలేరుతో పాటు ఇతర కాలువలు పొంగి పొర్లుతూ ఆ నీరంతా కొల్లేరుకు చేరుతోంది. ఏలూరు-కైకలూరు మార్గమధ్యలోని పెద్ద ఎడ్లగాడి, పెనుమాకలంక రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది లంక గ్రామాలను గురువారం ఉదయం నుంచే పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. నీరు ఏలూరు - కైకలూరు రోడ్డు వద్ద నీరు పొంగి పొర్లుతుండడంతో వెంటనే వాహనాల రాకపోకలను నిషేధించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఏలూరు రూరల్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్, కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, సిబ్బంది ఆ ప్రాంతాలను పరిశీలించారు. రెండు వైపులా పోలీస్ పికెట్లను ఏర్పాటు చేశారు. ఏలూరు డిపో నుంచి భీమవరం, నరసాపురం, పాలకొల్లు వెళ్ళే బస్సులను నారాయణపురం, రాచూరు, గణపవరం, భీమవరం మీదుగా పాలకొల్లు, నరసాపురం పంపిస్తున్నారు. నరసాపురం-భీమవరం డిపోకు చెందిన బస్సులు ఇదే మార్గంలో ఏలూరుకు వస్తాయి. మరోవైపు కైకలూరు వరకు భీమవరం, నరసాపురం బస్సులను అదనపు సర్వీసులుగా తిప్పుతున్నారు. అక్కడ వరకే వచ్చి ఆ బస్సులు తిరిగి వెళ్ళిపోతున్నాయి. కైకలూరు నుంచి ఏలూరు రావడానికి అవకాశం లేక పోవడంతో ప్రయాణికులు గణపవరం, రాచూరు, నారాయణపురం మీదుగా వస్తుండగా మరికొంత మంది మండవల్లి, గుడివాడ, హనుమాన్ జంక్షన్, ఏలూరుకు వస్తున్నారు. ఏలూరు డిపోనకు చెందిన బస్సులను నారాయణపురం, రాచూరు, గణపవరం మీదుగా భీమవరానికి పంపిస్తున్నామని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎన్‌వీఆర్ వర ప్రసాద్ చెప్పారు. నర్సాపురం, భీమవరం డిపో బస్సులు కైకలూరు వరకు నడుపుతున్నారని వెల్లడించారు.

బాహ్య ప్రపంచానికి దూరంగా..

మండవల్లి మండల కొల్లేటి లంక గ్రామాలు దాదాపు నీట మునిగే పరిస్థితి. ఇప్పటికే గ్రామాల్లో రహదారులు ముంపు బారినపడి బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్నాయి. పెనుమాకలంకకు పెద్దఎడ్లగాడి నుంచి బోటు ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. పెనుమాకలంక, నందిగామలంక, ఉనికిలి, ఇంగిలిపాకలంక, పులపర్రు, తక్కెల్లపాడు గ్రామాల్లోని పలు ప్రాంతాలు ముంపు బారినపడ్డాయి. చింతపాడు, కొవ్వాడలంక గ్రామాలు ముంపు అంచు న జీవనం సాగిస్తున్నారు. చింతపాడు నుంచి యాగినమిల్లి వెళ్లే రహదారి జల దిగ్బంధంలో చిక్కుకుంది. పెద్ద ఎడ్లగాడి వద్ద దిగువకు నీటి ప్రవా హానికి అవరోధంగా ఉన్న గుర్రపుడెక్క తోడును ఎన్డీయే నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో తొలగింపు చర్యలు చేపట్టారు. ముంపు గ్రామాల్లోని పరిస్థితిని మండవల్లి తహసీల్దార్ గోపాల్ పరిశీలించారు. ఐదారు రోజులుగా నీటిలో మునిగిన వరి పొలాలు కుళ్లిపోతున్నాయని కానుకొల్లు రైతులు ఆవేదన చెందుతున్నారు.

శాంతించిన తమ్మిలేరు..

తమ్మిలేరులో వరద తగ్గుముఖం పట్టడంతో ఏటి ఒడ్డు గ్రామాల ప్రజలు, రైతులు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టుకు గురువారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 1529 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 2400 క్యూసెక్కులు ఉండగా జలాశయం నీటి మట్టం 345.9 అడుగులు ఉన్నట్టు ఏఈ పరమానందం చెప్పారు.

ఆరెంజ్ అలర్ట్

- జిల్లాకు పొంచివున్న ముప్పు..
- కురుస్తున్న భారీ వర్షాలు.. ఆగిరిపల్లిలో అత్యధికం

ఏలూరు సిటీ, సెప్టెంబరు 5 : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. శుక్రవారం నుంచి మధ్య బంగాళా ఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడుతుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే జిల్లాలో అధిక వర్షాల వల్ల 4,782.38 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు, పెసలు, మినుము, వేరుశనగ పంటలు పూర్తిగా నీట మునిగాయి. మళ్లీ అల్పపీడనం కారణంగా భారీగా వర్షాలు కురిస్తే తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు ఏలూరు జిల్లాలో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ ఆరంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఏటా వినాయక చవితికి వాన ముసురు ఉంటుంటుంది. ఈసారి అల్పపీడనం ఏర్పడనున్న దృష్ట్యా ఈ ప్రభావం చవితి వేడుకలపై పడనుంది. జిల్లాలో గడచిన 24 గంటలలో అత్యధికంగా ఆగిరిపల్లి మండలంలో 104.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు అయింది. కలిదిండి 74.4, ముదినేపల్లి 66.8, వేలేరుపాడు 62.8, కుక్కునూరు 60.4, కైకలూరు 59.2, ముసునూరు 55.2, లింగపాలెం 52.2, మండవల్లి 51, నూజివీడు 49.6, దెందులూరు 47.6, ఏలూరు రూరల్ 47, పెదవేగి 46.4, కామవరపుకోట 44.6, పెదపాడు 33.4, ఏలూరు అర్బన్ 33.3, చాట్రాయి 32.6, ద్వారకాతిరుమల 31.2, టి.నరసాపురం 27.2, పోలవరం 25.6, జీలుగుమిల్లి 23.8, కొయ్యలగూడెం 22.8, నిడమర్రు 22.4, జంగారెడ్డిగూడెం 17.8, భీమడోలు 17.2, ఉంగుటూరు 15.4, చింతలపూడి 14.2, బుట్టాయిగూడెం 11.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

జిల్లాలో వరద ప్రభావం సాధారణ స్థితికి వచ్చే వరకు సహాయ పునరావాస కార్యక్రమాలను అధికారులు కొనసాగించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో గోదావరి, కొల్లేరు వరద పరిస్థితి, వర్షాల ఆరంజ్ అలెర్ట్‌పై సంసిద్ధత, చెరువుల స్థితి, సహాయ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై గురువారం రాత్రి జిల్లా అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ స్థానికంగా కురుస్తున్న వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా గోదావరి నది తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రికి వరద రెండవ ప్రమాద స్థాయికి చేరుకునే అవకాశం ఉందని ఇరిగేషన్ శాఖ అధికారుల అంచనాతో అన్ని శాఖల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.

పొంగుతున్న వాగులు



చెక్కపల్లి వద్ద ఉధృతంగా సంధ్యవాగు

ముసునూరు/ఆగిరిపల్లి/పెదపాడు : గురువారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి చెక్కపల్లి వద్ద సంధ్యవాగు ఉధృతంగా ప్రహిస్తోంది. ఇప్పటికే ఈ వాగుపై ఉన్న వంతెన కోతకు గురై కూలిపోయి, రహదారికి గండిపడి రోజులు గడుస్తుండడంతో ముసునూరు-చెక్కపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెక్కపల్లి వెళ్లాలంటే రమణక్కపేట మీదుగా అదనంగా ఆరు కిలోమీర్లు చుట్టూ తిరిగి వెళ్ళాల్సిన పరిస్థితి. ఆగిరిపల్లి ఫీడర్ ఛానల్‌కు గండి పూడ్చినా మళ్ళీ వచ్చిన వరద వల్ల కట్ట తెగిపోయి రోడ్డు మీదకు వరద వస్తోంది. ఆగిరిపల్లి-నూగొండపల్లికి రోడ్డు మార్గం లేకపోయింది. ఇదేవాగు తోటపల్లి గ్రామ శివారులో రోడ్డుపై పారుతూ ఆగిరిపల్లి-తోటపల్లికి మధ్య సంబంధాలను తెంపేసింది. ఆగిరిపల్లి నుంచి ఈదులగూడెం వెళ్ళే రోడ్డులో గల పెదవాగు, చినవాగు రెండూ తెగి వరద రోడ్డుమీదకి పారి ఆగిరిపల్లి - ఈదులగూడెం వైపు రోడ్డు సంబంధాలు తెంపేశాయి. డీఎస్పీ శ్రవణ్‌కుమార్ మండలంలోని చెరువులను పరిశీలించి పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు.

బుడమేరు ఉధృతికి..

బుడమేర ఉధృతంగా ప్రవహిస్తోంది. పెదపాడు మండలం కొణికి, గోగుంట గ్రామాల మరోసారి వరద బారినపడ్డాయి. వరద తగ్గి ఊపిరి పీల్చుకున్న సమయంలో మరలా వరద నీరు గ్రామాన్ని ముంచెత్తుతుండటంతో గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కృష్ణా జిల్లాలో చెరువులకు గండ్లు పడటంతో పెద్దఎత్తున వస్తున్న వరదనీరు గురువారం సాయంత్రానికి ఈ గ్రామాల్లోకి చేరాయి. ఇళ్ల చుట్టూ మోకాలలోతు నీరు చేరగా, మంచినీటి చెరువులు, రోడ్లు అన్ని జలమయమయ్యాయి. వసంతవాడలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరానికి అధికారులు తరలిస్తున్నారు. కొణికి వద్ద బుడమేర కాలువ గట్టు కొన్నిచోట్ల బలహీనంగా ఉండటంతో గండి పడే ప్రమాదాన్ని నివారించేందుకు ముందు జాగ్రత్త చర్యగా గట్టును పటిష్టం చేసే చర్యలు తీసుకున్నట్లు సర్పంచి పొట్లూరి యుగంధర్ తెలిపారు.



కొణికిలో ఇళ్ల చుట్టూ మోకాల లోతు వరద నీరు

వరద బాధితులకు అంబికా సంస్థలు..
రూ.10 లక్షల విరాళం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 5:ఉభయ, తెలుగు రాష్ట్రాల్లో వరదల తాకిడికి తీవ్రనష్టం వాటి ల్లింది. రెండు ప్రభుత్వాలు ప్రజలను ఆదుకునేందుకు కృషి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమవంతు బాధ్యతగా అంబికా దర్బార్ బత్తి (అంబికా సంస్థలు) ఆపత్కాల సమయంలో అండగా ఉండాలనే ఉద్దేశంతో రూ.10 లక్షలు విరాళంగా అందజేసింది. గురువారం సీఎం చంద్రబాబును కలిసి అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ రూ.5లక్షలు విరాళాన్ని అందజేశారు. అంబికా సంస్థల డైరెక్టర్ అంబికా హనుమ, తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి విక్రమార్కను హైదరాబాద్‌లో కలిసి రూ.5లక్షల చెక్కును అందజేశారు.



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న అంబికా కృష్ణ

రెక్కలు.. ముక్కలు

- ఏలూరు జిల్లా వైసీపీలో వరుస షాక్‌లు
- తాజాగా జడ్పీ చైర్మన్ భర్త రాజీనామా -7లో

విద్యా విప్లవానికి నాంది పలుకుదాం

- కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపు..
- ఉత్తమ గురువులకు పురస్కారాల అందజేత



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 5 : పాస్ పర్సంటేజీలకే పరిమితం కాకుండా విలువలతో కూడిన విద్య, నిజాయితీలను బోధించడం ద్వారా విద్యార్థులను సామాజిక పౌరులుగా చేయడం ద్వారా విద్యా విప్లవానికి జిల్లా ఉపాధ్యాయులు రాష్ట్రంలో నాంది పలకాలని కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జడ్పీ మీటింగ్ హాలులో గురువారం నిర్వహించిన కార్య క్రమంలో ఆమె మాట్లాడుతూ టీచర్లను సామాజిక కార్యకర్తలుగా పేర్కొంటూ వారికి సాష్టాంగ నమస్కారం చేస్తున్నానని భావోద్వేగానికి లోనయ్యారు. ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ దేవుడంటే గురువేనని, క్రమశిక్షణ ఉపాధ్యాయుల నుంచే అలవడుతుందన్నారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ నవ్యాంధ్ర ప్రదేశ్ పునర్నిర్మాణానికి ఉపాధ్యాయులు ముఖ్యభూమిక వహించాల న్నారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా విధులకు హాజరైన టీచరు మురళీమోహనరావు అందరికీ ఆదర్శప్రాయుడని ప్రశంసించారు. జడ్పీ సీఈవో సుబ్బారావు నేతృత్వం లో రూపొందిం చిన జిల్లా పరిషత్ యాజమాన్య టీచ ర్లు 7,412 మందికి సంబంధించిన నాలుగేళ్ల పీఎఫ్ ఫైనల్ బ్యాలెన్స్‌షీట్లను విడుదల చేసి డీడీవోలకు అందజేశారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 31 మందిని సత్కరించారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఈవో అబ్రహం, డిప్యూటీ సీఈవో నిర్మలజ్యోతి, డీవైఈవోలు, ఎంఈవోలు, సమగ్రశిక్ష అధికారులు, అన్ని ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.



డీఈవోతో అవార్డు గ్రహీతలు




ఆర్ఎస్ (ఫైల్)

నివాళులర్పిస్తున్న సీపీఎం, ఇతర వామపక్ష నాయకులు..

మాజీ ఎమ్మెల్యే, సీపీఎం నేత ఆర్ఎస్ మృతి

భీమవరం టౌన్,సెప్టెంబరు 5:సీపీఎం పోరాటాల ఉమ్మడి జిల్లాల రథసారథి, మాజీ ఎమ్మెల్యే చించినాడ గ్రామానికి చెందిన రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్) (98) గురువారం మధ్యాహ్నం భీమవరంలోని తన పెద్ద కుమార్తె ఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు. ఆయన భార్య ఐద్వా జిల్లా నాయకురాలు సూర్యకాంతమ్మ కొన్నాళ్ల కిందట మరణించారు. ముగ్గురు కుమార్తెలలో పెద్ద కుమార్తె భారతి మృతిచెందారు. వృద్ధాప్య రీత్యా ఆయన భీమవరంలోని చిన్న కుమార్తె స్వరాజ్యమాత వద్ద ఉంటున్నారు. కొన్ని రోజులుగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఇంటి వద్దే వైద్యం అందిస్తున్నారు. గురువారం ఆయన మృతి చెందారు. ఆర్ఎస్ 1953 నుంచి 1965 వరకు చించినాడ గ్రామానికి సర్పంచ్‌గా పనిచేశారు. 1951లో కమ్యూనిస్ట్ పార్టీ పూర్తికాలం కార్యకర్తగా మారారు. 1965లో నరసాపురం నుంచి సీపీఎం తరఫున అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి పరకాల శేషావతరంపై శాసనసభ్యుడిగా గెలుపొందారు. అప్పట్లో శాసన సభలో సీపీఎం ఉప సభానాయకుడిగా పనిచేశారు. సీపీఎం ఉమ్మడి జిల్లాల కార్యదర్శిగా ,రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ప్రజల పక్షాన అనేక పోరాటాలను చేశారు. 1999లో నరసాపురం ఎంపీగా పార్టీ తరుపున పోటీ చేశారు. చించినాడ స్వగ్రామం కావడం రాజకీయ ప్రస్థానం కూడా ఈ గ్రామం నుంచే ప్రారంభం కావడంతో గ్రామంపై ఆయన ఎనలేని ప్రేమాభిమానాలు చూపించేవారు. శుక్రవారం ఉదయం చించినాడలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

11న అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 5: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈ నెల 11వ తేదీన ఏలూరు డిస్ట్రిక్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 14 నుంచి 16వ తేదీ వరకు గుంటూరు జిల్లా మంగళగిరి, ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి ఎంపిక పోటీలు ఈ నెల 11న ఉదయం 8 గంటల నుంచి ఏఎస్ఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10,12,14,16,18,20 వయసు గల వారికి, అండర్-23 విభాగంలో బాల,బాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రం లేదా 10వ తరగతి మార్కుల జాబితా తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వివరాలకు 62814 31202 నంబర్లో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

12న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 5: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాపరిషత్ 1 నుంచి 7 వరకు స్థాయి సంఘ సమావేశాలు ఈనెల 12 వతేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు జిల్లా ప్రజా పరిషత్ సీఈవో సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.



సర్వేపల్లి చిత్రపటం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేస్తున్న అన్ ఎయిడెడ్ అధ్యాపకులు

అన్ ఎయిడెడ్ అధ్యాపకుల నిరసన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 5 : ప్రభుత్వాలు మారుతున్నా అన్ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులకు న్యాయం జరగక మోసపోతూనే వున్నారని విచారం వ్యక్తం చేస్తూ గురుపూజోత్సవం సందర్భంగా అశోక్‌నగర్‌లోని ఎస్.పీ.డీ.బీ.టీ జూనియర్ కళాశాల అన్ ఎయిడెడ్ అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నిరసన తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రేమ్‌కుమార్, రమేష్, జయశంకర్ తదితరులు మాట్లాడుతూ అన్ ఎయిడెడ్ లెక్చరర్లు చాలీచాలని జీతాలతో దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వమైనా అన్‌ఎయిడెడ్ అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రతను కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించేలా కనీస వేతన స్కేళ్లను వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. అధ్యాపకులు అంబేద్కర్, నాని బాబు, సుబ్బారావు, లక్ష్మీకుమారి, మమతాకుమారి, ప్రవల్లిక పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎస్పీగా శ్రీరామ్‌బాబు బాధ్యతలు



ఏలూరు క్రైం, సెప్టెంబరు 5 : జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ ఆఫీసర్ (విజిలెన్స్ ఎస్పీ)గా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీరామ్ బాబు గురువారం ఏలూరు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. 1989 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన శ్రీరామ్‌బాబు గుంటూరు రేంజ్‌లోని పలు ప్రాంతాల్లో సీఐగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో డీఎస్పీగా విధులను కొనసాగించారు. ప్రకాశం జిల్లా రీజినల్ ఇంటిలిజెన్స్ అధికారిగా విధులను కొనసాగిస్తూ సాధారణ బదిలీల్లో ఆయనను ఏలూరు జిల్లా ఆఫీసర్‌గా నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తున్న 12 మంది అధికారులను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా పరిపాలనా విభాగంలో గత నెల 27న విధుల్లోకి చేరిన శ్రీరామ్ బాబును ఏలూరుకు నియమించారు.

పింఛన్ సొమ్ము చోరీ

ఆగిరిపల్లి, సెప్టెంబరు 5: నెక్కలంగొల్లగూడెం మహిళా పోలీస్ లలితకుమారి పింఛన్ సొమ్మును చేజార్చుకున్నారు. గతనెల 31న శనివారం పింఛనుదారులకు పంచడానికి రూ.రెండు లక్షల 44 వేలు బ్యాంకు నుంచి తీసుకుని రూ.లక్షా 22 వేల పంపిణీ చేశారు. అనంతరం తన ఆరోగ్యం బాగుండక వర్షం కూడా భారీగా కురుస్తుండటంతో తరువాత రోజు ఇద్దామని ఉద్దేశంతో విజయవాడ సమీపంలోని తన స్వస్థలం దేవీనగరకు వెళ్ళిపోయారు. తరువాత వరద కారణంగా ఆది, సోమవారం ఆ డబ్బులు ఇవ్వలేదు. మంగళవారం పింఛన్ పంచటానికి బ్యాగు తెరిచి చూడగా డబ్బు కనబడకపోవడంతో ఆగిరిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పు చేసి పింఛన్‌దారులకు సొమ్ము పంపిణీ చేశారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రెక్కలు.. ముక్కలు



ఏలూరు జిల్లా వైసీపీలో వరుస షాక్‌లు
తాజాగా జడ్పీ చైర్మన్ భర్త రాజీనామా
జడ్పీ చైర్మన్ దారెటు ?
పక్కచూపులు చూస్తున్న పలువురు జడ్పీటీసీలు,ఎంపీపీలు
వైసీపీ ఏలూరు జిల్లా సారథిగా దూలం

ఏలూరు జిల్లాలో వైసీపీ ఫ్యాన్ రెక్కలు ముక్కలవుతున్నాయి. వరుస రాజీనామాలు ఆ పార్టీకి షాక్ ఇస్తున్నాయి. ఒక్కొక్కరుగా పార్టీ నుంచి జారు కుంటున్నా నాయకత్వం మాత్రం పోతేపోని అన్నట్టుగానే ఉంది. నిన్నకాక మొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ఆళ్ల నాని పార్టీ నుంచే నిష్క్రమించారు. తాజాగా జడ్పీ చైర్మన్ భర్త ఘంటా ప్రసాదరావు పార్టీకి రాజీ నామా చేశారు. కూటమి వైపు వెళ్ళేందుకు దాదాపు సమాయత్తమయ్యారు. ప్రస్తుత ఎమ్మెల్సీ జయమంగళ రామారావుకు కూడా గేలం వేసినట్టు ఇప్పటికే ప్రచారం సాగింది. వీరితో పాటు మరికొందరు జడ్పీటీసీలు, ఎంపీపీలు పక్కచూపులు చూస్తున్నట్టు సమాచారం.

వస్తాం.. వెళ్ళొస్తాం :

గడిచిన రెండు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటకట్టుకున్న వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీ వ్యవహార ధోరణి నచ్చక కొందరు రాజీనామాలు చేస్తుంటే రాజకీయ భవిష్యత్తు కోసం ఇంకొందరు పక్క చూపులు చూస్తున్నారు. ఏలూరు నగర వైసీపీ అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్‌తో ఆరంభమైన రాజీనామాల పర్వం కొనసాగుతూనే ఉంది. ఆదిలో ఎన్నికలకు ముందే పార్టీ వ్యవహారాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసి అక్కడి నుంచి బయటపడిన సీనియర్ నేత ఎంఆర్‌డీ బలరాం, ఆయన సతీమణి ఈశ్వరిలు టీడీపీలో చేరారు. అక్కడి నుంచి ఒకరు తరువాత ఒకరు నేరుగా వైసీపీ నుంచి బయటకు వస్తూనే ఉన్నారు. బొద్దాని శ్రీనివాస్ రాజీనామాతో పాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామాలు చేస్తున్నట్టు బొద్దాని, ఇటు మంచెం మైబాబు లేఖల్లో పేర్కొన్నారు. తరువాత మాజీ మంత్రి ఆళ్ల నాని వైదొలిగారు. వై.ఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి ఆది నుంచి అత్యంత సన్నిహితంగా ఉన్న ఆళ్ల నాని నిష్క్రమణ ఆ పార్టీకి అతి పెద్ద షాక్. దీని తరువాత మేయర్ నూర్జహాన్ దంపతులు పార్టీకి బైబై చెప్పి సైకిల్ ఎక్కారు. వీరిద్దరి బాటలోనే మరో 19 మంది ఏలూరు కార్పొరేటర్లు ప్రయాణించారు. ఏలూరు నియోజక వర్గంలో వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలు వైసీపీ పెద్దలను సైతం దిగ్భ్రాంతికి గురిచేసినా ఇదంతా సర్వసాధారణం అన్నట్టుగా వ్యవహరించినట్టు కనిపిస్తుంది.

జడ్పీ చైర్మన్ దంపతుల రూటెటు ?




జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ దంపతులు గడిచిన రెండు రోజులుగా వైసీపీ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆ మేరకు తాజాగా జడ్పీ చైర్మన్ భర్త, వైసీపీ బీసీ విభాగం అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పార్టీకి రాజీనామా చేశారు. కొన్నాళ్ళ క్రితం జడ్పీ చైర్మన్ దంపతులిద్దరు, మిగతా మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పార్టీ అధ్యక్షుడు జగన్‌తో భేటీ అయ్యారు. పార్టీ స్థితిగతులపై వీరందరితోను అప్పట్లో జగన్ చర్చించారు. అప్పటికే ఆళ్ల నాని పార్టీ నుంచి నిష్క్రమించడం పట్ల జగన్ సైతం అదేంటలా చేశారంటూ నివ్వెరపోయారు. పనిలోపనిగా పార్టీపరమైన చర్చ జరుగుతున్నప్పుడు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఆళ్ల నాని స్థానంలో ఎవరిని నియమించ నున్నామో సూచాయిగా సంకేతం ఇచ్చారు. ఇదే సందర్భంలో ఘంటా ప్రసాదరావునుద్దేశించి మీకు తగినంత గౌరవం లభిస్తుందంటూ సంకేతం ఇచ్చారు. దీంతో అప్పటికే పార్టీ వ్యవహారాలపై ఒకింత గుర్రుగా ఉన్న జడ్పీ చైర్మన్ దంపతులు కాస్త మెత్తపడినట్టే కనిపించినా తరువాత వెంటనే మళ్లీ మనుసు మార్చుకున్నారు. వైసీపీ నుంచి బయటపడి నేరుగా జనసేనలో చేరేందుకు కొందరు పెద్దలను సంప్రదించారు. అయితే బీసీ సామాజిక వర్గాన్ని దృష్టిలో పెట్టుకుని జడ్పీ చైర్మన్‌గా అత్యంత కీలకమైన బాధ్యతలను పార్టీలో మరికొందరు పోటీపడినా కాదని అప్పట్లో ప్రసాదరావును సంతృప్తిపరిచేందుకు ఆయన సతీమణి పద్మశ్రీకి పార్టీ ఆ పదవి అప్పగించింది. పార్టీ అధికారం కోల్పోయిన తరువాత అనేక పరిణామాలు వరుసగా చోటు చేసుకుంటున్న తరుణంలో ఒకానొక దశలో ప్రసాదరావుకు జిల్లా అధ్యక్ష పదవి ప్రతిపాదన కూడా జరిగింది. ఆ తరువాత వెంటనే ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకున్నారు. దీంతో పార్టీ వైఖరి పట్ల ప్రసాదరావు తీవ్ర అసహనానికి, అసంతృప్తికి గురయ్యారు. ఇదిలా ఉండగా జడ్పీ చైర్మన్ దంపతులు జనసేనలో చేరేందుకే మొదటి నుంచి ఆసక్తితో ఉన్నారు. ఈ పరిణామాలను అటు టీడీపీ కూడా జాగ్రత్తగా పరిశీలించింది. వాస్తవానికి జడ్పీలో టీడీపీకి ఒక అంకె బలం మాత్రమే ఉంది.మరి అలాంటి పరిస్థితుల్లో జడ్పీచైర్మన్ పార్టీ నుంచి బయటపడితే ఎలా వ్యవహరించాలని కూడా ఒకవైపు జనసేన సీనియర్లు ఇప్పటికే చర్చించారు. వాస్తవానికి ఘంటా దంపతులు చింతమనేనిపై చాలా కాలం నుంచి తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఒకప్పటి దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి అనుకూలంగా వ్యవహరిస్తూ చింతమనేనిపై అక్రమ కేసులు బనాయించారు. ఈ విధానాన్ని చింతమనేని నేరుగా ఎదుర్కొన్నారు. నువ్వానేనా అనే స్థాయిలో ఎన్నికలకు ముందే వీరి మధ్య సవాళ్ళు నడిచాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు టీడీపీ నేతలు చైర్మన్‌ను పార్టీలో చేరేలా అంతర్గతంగా చర్చించినా టీడీపీ పెద్దలు మాత్రం అసలు ఆ వైపే చూడలేదు. ఇప్పటిదాకా జడ్పీ చైర్మన్ హోదాలో ఉన్న ఘంటా పద్మావతి వైసీపీకి ఎలాంటి రాజీనామా చేయలేదు. కేవలం ఆమె భర్త మాత్రమే గురువారం రాజీనామా చేశారు.

ఇక ఎంపీపీలు.. జడ్పీటీసీల వంతు

జిల్లా పరిషత్ చైర్మన్ వ్యవహారం కాస్తా ఇంకా ఒక కొలిక్కి రాకమునుపే ఉమ్మడి పశ్చిమగోదావరిలోని కొందరు జడ్పీటీసీలు పక్క చూపులు చూస్తున్నారు. దాదాపు 15 మంది వరకు రంగు మార్చుకోవడానికి సంసిద్ధంగానే ఉన్నా తమంతట తాముగా ముందుకొచ్చేకంటే మిగతా పార్టీల నుంచి కచ్చితమైన ఆఫర్ వస్తే చూద్దామన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కొందరు జనసేన వైపు మొగ్గు చూపడం ఆరంభించారు. ప్రత్యేకించి ఒక సామాజిక వర్గానికి చెందిన సభ్యులు ఈ దిశగా ఆసక్తి కనబరుస్తున్నారు. ఎలాగూ జడ్పీ చైర్మన్ పద్మశ్రీ కూడా జనసేన వైపే మొగ్గు చూపుతున్నట్టు ఇప్పటికే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో తాము కూడా అదేబాట పట్టాలనే నేపథ్యంలో ఉన్నారు. ఎందుకనంటే జడ్పీటీసీ సభ్యులుగా పార్టీపరమైన చిహ్నంతోనే వీరంతా గెలుపొందారు. అలాగే కొందరు ఎంపీపీలు వైసీపీ నుంచి ఇతర పార్టీల్లోకి జంప్ అవడానికి సిద్ధంగా ఉన్నారు.

దూలంకే పార్టీ పగ్గాలు

కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుకే వైసీపీ జిల్లా అధ్యక్ష పగ్గాలు అప్పగించాలని నిర్ణయించారు. ఈ మేరకు అధికారికంగా నేడో, రేపో ఆదేశాలు వెలువడబోతున్నాయి. జిల్లా పగ్గాలు మోసేందుకు మిగతా వారె వరూ ఆసక్తి ప్రదర్శించకపోవడం ఒక ఎత్తయితే కాపు సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో దూలం వైపే పార్టీ మొగ్గు చూపింది. ఇంతకు ముందు ఖాళీ అయిన కొన్ని జిల్లాల అధ్యక్ష పదవులకు కొందరిని నియ మిస్తూ బుధవారం నాడే వైసీపీ జాబితా ప్రకటించింది.







వస్తున్నా.. వచ్చేస్తున్నా..!

చవితి వేడుకలకు గణనాథులు ముస్తాబయ్యారు..వస్తున్నా అంటూ పూజలు అందుకునేందుకు మండపాలకు బయలుదేరారు.. వివిధ రూపాల్లో కళాత్మకంగా రూపుదిద్దుకున్న గణనాయకుల విగ్రహాలు ముచ్చట గొలుపుతున్నాయి. గురువారం ఏలూరులో విగ్రహాలను తమ గ్రామాలకు తీసుకువెళుతున్న దృశ్యాలివి..



లక్ష్మీపురం దాబా హోటల్ వద్ద ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న వీఆర్వో భాషా..



జీలుగుమిల్లిలో మాంసం దుకాణం వద్ద మాంసం లాగుతున్న కుక్క

దాబా హోటల్‌లో నిల్వ ఆహార పదార్థాలపై వీఆర్వో తనిఖీ

జీలుగుమిల్లి, సెప్టెంబరు 5 : లక్ష్మీపురంలో జాతీయ రహదారి పక్కన నిర్వహించే ఓ దాబా హోటల్‌లో నిల్వ ఆహార పదార్థాలు వాడుతున్న విషయమై వీఆర్వో బాషా ఆరా తీశారు. గురువారం కొందరు స్థానికులు దాబా హోటల్‌కు వెళ్లారు. రోటీలు చికెన్ ఆర్డర్ చెప్పడంతో వారికి పాడై నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు వేడి చేసి ఇచ్చారు. దీంతో హోటల్ నిర్వాహకుడిపై తహసీల్దార్ సందీప్‌కు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వీఆర్వో బాషా హోటల్‌లో నిల్వ ఉంచి ఆహారం చికెన్ పరిశీలించారు. కొద్ది రోజులుగా అవి ఫ్రిజ్‌లో ఉంచడంతో పాడైనట్లు గుర్తించారు. దీంతోపాటు పగిలిన గుడ్లు, పాచిపోయిన ఉల్లి పాయలు వాడుతున్నారన్నారు.వినియోగదారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని సంబంధిత అధికారులు వర్షాకాలంలో హోటళ్లు, మాంసం దుకాణాల్ని తనిఖీలు చేయాలని స్థానికులు కోరారు

వాగులో కొట్టుకుపోయి మహిళ మృతి

నూజివీడు టౌన్,సెప్టెంబరు 5: తన అన్నను చూద్దామని ఇంటి నుంచి బయలుదేరి వాగు దాటుతూ కొట్టుకు పోయి ఓ మహిళ మృతి చెందిది. మర్సపూడికి చెందిన దొడ్డి లక్ష్మి జంగంగూడెంలోని తన అన్న ఇంటికి శనివారం బయలు దేరింది. జంగంగూడెంలో లెవల్‌బ్రిడ్జ్ వద్ద రామిలేరు దాటుతూ అదుపు తప్పి వాగులో పడిపోయి మృతి చెందింది. రామిలేరులోని ముళ్ల పొదల్లో లక్ష్మి మృతదేహాన్ని గుర్తిం చిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు.

క్రైం కార్నర్..

తాడేపల్లిగూడెంలో మహిళ అనుమానాస్పద మృతి



బొచ్చిలి బేబి (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 5: మెడకు తువాలు చుట్టి మహిళ మృతదేహం అనుమానాస్పద స్థితిలో కనిపించిన ఘటన గురువారం తాడేపల్లిగూడెంలో వెలుగుచూసింది. తాడేపల్లిగూడెం 4వ వార్డు బేతావారి వీధిలో నివాసం ఉంటున్న బొచ్చిలి బేబి (50) భర్త మృతి చెందడంతో ఆమె కూరగాయల వ్యాపారం చేసుకుంటూ ముగ్గురు పిల్లలకు వివాహాలు చేసింది. ప్రస్తుతం ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో గురువారం బేబి ఇంట్లో మెడకు తుండు చుట్టి బిగించి విగత జీవిగా పడి ఉంది. కానీ ఇంట్లో రూ.లక్షా 50 వేల నగదు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అంటే ఎవరో కక్షతోనే హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుబ్రహ్మణ్యం వివరించారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి పంచనామా చేపట్టారు.

లారీ ఢీకొని బాలుడి మృతి

భీమవరం క్రైం, సెప్టెంబరు 5 : సైకిల్‌పై వెలుతున్న బాలుడిని లారీ ఢీకొన్న ఘటనలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. భీమవరం వన్ టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బొక్కావారి పాలెంకు చెందిన బొక్కా శ్రీనుకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు లక్ష్మీశ్రీగణేష్ (13) 9వ తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలకు వెళ్ళివచ్చిన అనంతరం తల్లి మంచినీరు తీసుకురమ్మని చెప్పగా సైకిల్‌పై వెళుతుండగా సరిగ్గా పాలకొల్లు వైపు నుంచి భీమవరం వైపు వస్తున్న లారీ ఢీకొట్టడంతో గణేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

మద్యం మత్తులో ఒంటికి నిప్పు.. చికిత్స పొందుతూ మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 5 :మద్యం మత్తులో తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని అగ్ని ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన ఒక లారీ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన వేల్పూరి ఉమామహేశ్వరరావు (49) లారీ డ్రైవర్‌గా చేస్తున్నాడు. భార్య నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటున్నాడు. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. ఒంటరి తనంతో తీవ్ర మనస్థాపానికి గురైన అతను ఈనెల 1వ తేదీన తంగెళ్ళమూడి ప్రాంతం జంగారెడ్డిగూడెం రోడ్డులోని జాతీయ రహదారి సమీపంలో ఒక లారీ ఆఫీసు వద్ద మద్యం మత్తులో తనపై పెట్రోలు పోసుకుని నిప్పటించుకున్నాడు. తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందు తున్న అతను గురువారం ఉదయం మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగొచ్చి వేధిస్తున్న భర్తపై పోలీసులకు ఫిర్యాదు

భీమవరం క్రైం, సెప్టెంబరు 5 : తన భర్త నిత్యం మద్యం సేవించి వచ్చి కొట్టి వేధిస్తున్నాడంటూ భీమవరం మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన సాలిమట్ల ఎస్తేరురాణి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్తేరు రాణికి అదే గ్రామానికి చెందిన శ్యాంబాబుతో 17 సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు సంతానం. శ్యాంబాబు నిత్యం మద్యం సేవించి వచ్చి వేధిస్తుండటంతో ఆమె అదే గ్రామంలో పుట్టింటికి వెళ్ళిపోయింది. అయితే బుధవారం రాత్రి శ్యాంబాబు మద్యం సేవించి ఎస్తేరురాణి వద్దకు వెళ్ళి కొడుతుండగా అడ్డువెళ్ళిన ఎస్తేరు రాణి నానమ్మపై కూడా దాడి చేశాడు. ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ వీర్రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

ఉంగుటూరు,సెప్టెంబరు 5 : ఉంగుటూరు జాతీయ రహదారి వద్ద బస్ కోసం వేచి ఉన్న వృద్ధురాలిని ఏలూరు వైపు వెళుతున్న మోటారు సైకిల్ ఢీకొనడంతో ఉంగుటూరు గ్రామానికి చెందిన కారెం వెంకమ్మకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వెంకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు జరుపుతున్నామని మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ సూర్య భగవాన్ తెలిపారు.

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు

టి.నరసాపురం, సెప్టెంబరు 5: వ్యక్తిపై దాడిచేసి చంపుతామని బెదిరించిన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఏఎస్పై వి.జయకుమార్ తెలిపారు. టి.నరసాపురంలోని మెట్టగూడెంకు చెందిన నంద్యాల రమేష్ ఈనెల 3న రోడ్డుపై వెళుతుండగా అదే గ్రామానికి చెందిన గుజరాతి దుర్గతో బెజవాడ గోపి మరికొందరు గొడవ పడుతుండగా పోలీ సులకు సమాచారం ఇవ్వడంతో గోపి మరో ఐదుగురు చంపుతామని బెది రించారని, ఈనెల 4న బాధితురాలు దుర్గతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళు తుండగా దాడిచేసి కొట్టారని ద్విచక్రవాహనం తాళాలు లాక్కున్నారని రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.




పరిశీలిస్తున్న పోలీసులు.. భర్తతో సత్యవతి (ఫైల్)

అనుమానంతో భార్యను కడతేర్చిన భర్త

ఉండి సెప్టెంబరు 5: అనుమానంతో నిద్రిస్తున్న భార్యను నిద్రలోనే కడతేర్చాడు భర్త..తలదిండుతో నొక్కి చంపివేశాడు. ఉండి మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన గొల్ల చిరంజీవి గల్ఫ్ వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఆటో నడుపుకుంటున్నాడు. భార్య సత్యవతి వలంటీరుగా పనిచేసేది. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు 7వ తరగతి, చిన్న కుమారుడు 3వ తరగతి చదువుతున్నారు. భార్యను అనుమానిస్తూ తరచూ భర్త గొడవపడేవాడు.ఈనెల 4వ తేదీ బుధవారం ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. గురువారం అర్ధరాత్రి ఆమె నిద్రిస్తుండగా తలదిండుతో నొక్కి చంపివేశాడు. అనంతరం అతను పురుగుల మందు సేవించడంతో భీమవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ నజీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 5: అక్రమంగా మద్యాన్ని రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 167 సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు పట్టణ సీఐ మూర్తి తెలిపారు. వాహన తనిఖీలు చేస్తుండగా ఒక నిందితుడ్ని అదుపులోకి తీసుకొని 167 సీసాల మద్యా న్ని స్వాధీన పర్చుకొని అతడ్ని కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల పాటు న్యాయమూర్తి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.



కోమటిలంక వద్ద పోలీస్ పికెట్

పెరుగుతున్న తమ్మిలేరు

ప్రమాద ప్రాంతాల్లో పోలీస్ గస్తీ

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 5: తమ్మిలేరు ప్రవాహంతో ఏలూరు, కొల్లేరు పరీవాహక ప్రాంతాల్లో నీరు చేరుతోంది. లంక గ్రామాలను ఇప్పటికే అధికారులు అప్రమత్తం చేశారు. శనివారపుపేట లో బ్రిడ్జికి సమాంతరంగా నీటి ప్రవాహం వెళ్తుంది. నీరు బ్రిడ్జిపై చేరితే మళ్లీ రాకపోకలు నిలిపి వేయడానికి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తమ్మిలేరు వరద నీరు కొల్లేరు వెళుతూ లంక గ్రామాలకు చేరుతుండడంతో ఆ ప్రాంతాల్లో కూడా పోలీస్ పికెట్లను ఏర్పాటు చేశారు. ముందస్తుగా లైఫ్‌జాకెట్లను కూడా పోలీసులు సిద్ధంగా ఉంచారు. అవసరమైతే బోట్లు, ఫైర్ ఇంజన్లు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, రోబో లైఫ్‌బోట్లు, వరద బాధితులను ముందస్తుగా తరలించడానికి వాహనాలను రెవెన్యూ, పోలీసు అధికారులు సిద్ధం చేశారు. ప్రజలను అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని అంచనా వేయడానికి 24 గంటలు పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. గుడివాకలంక, వైఎస్‌ఆర్ కాలనీ, సాయినగర్, ఇందిరమ్మ కాలనీ, పోణంగి రోడ్డు, కోమటిలంక, పైడిచింతపాడు ప్రాంతాల్లో వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ ఆధ్వర్యంలో రూరల్ ఎస్‌ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్, సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారు. శనివారపుపేట వెళ్ళే కాజ్‌వే ఇరువైపులా టూటౌన్, త్రిటౌన్ పోలీసులు గస్తీ ఉన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ట్రాఫిక్ పోలీసులను కూడా నియమించారు. వరద పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా పోలీసు శాఖ అప్రమత్తంగా వైర్‌లెస్ (మ్యాన్‌ప్యాక్) సెట్లతో సిద్ధంగా ఉన్నారు. సహాయక కార్యక్రమాలు చేపట్టేందుకు ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాలతో డిస్ట్రిక్ట్ గార్డ్ ఆర్మ్‌డు రిజర్డు సిబ్బందిని కూడా పోలీస్ శాఖ సిద్ధం చేసింది.

వరద పరిస్థితిని పరిశీలించిన చింతమనేని



కోమటిలంకలో చింతమనేని

ఏలూరు రూరల్, సెప్టెంబరు 5: కొల్లేరు గ్రామాల్లో వరద నీటి ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గురువారం కొల్లేటి గ్రామాల్లో పర్యటించారు. కోమటిలంక ప్రాంతంలో రహదారిపై వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలను వరద ప్రవహిస్తున్న రోడ్లపై అనుమతించకుండా బారికేడ్లను సిద్ధం చేయాలన్నారు. నిర్లక్ష్యం కారణంగా ఏ ఒక్కరూ గల్లంతు అవ్వకూడదని, ఆస్తి, ప్రాణనష్టం జరగకూడదన్నారు. ఇప్పటికే ఇన్‌పుట్ డ్రెయిన్ల నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో కొల్లేరుకు వరదముంపు వచ్చే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వంకవారిగూడెం రహదారికి గండి



గండి పడిన రహదారి

జీలుగుమిల్లి, సెప్టెంబరు 5: ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరద నీటి ప్రవాహం ఎక్కువై వంకవారిగూడెం కల్వర్టు వద్ద గండి పడింది. వరదనీటి వల్ల మూడు రోజుల క్రితం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో అధికారులు రోడ్డు కొట్టుపోయి ఏర్పడ్డ గండిని పరిశీలించారు. అనంతరం జేసీబీతో గ్రావెల్ మట్టి ద్వారా గండి పూడ్చించారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మరలా కల్వర్టు వద్ద కొట్టుకుపోయి రోడ్డుకు గండి పడింది. సమీప గిరిజన గ్రామాల వారు మండల కేంద్రానికి వెళ్లే వీలు లేకుండా పోయింది.

వరద ప్రాంతాల్లో టీడీపీ నేతల పరిశీలన

వేలేరుపాడు, సెప్టెంబరు 5: వేలేరుపాడు మండలాన్ని గోదావరి వరద చుట్టుముట్టడంతో టీడీపీ నాయకులు పర్యటించి ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. పోలవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు గురువారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలు ముందుగానే అప్రమత్తమై సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సురక్షిత ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వం అన్నివిధాల సహకరిస్తుందన్నారు. ఎవరూ భయాందోళనలకు గురి కావల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

గణేశ్ ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

జీలుగుమిల్లి, సెప్టెంబరు 5: వినాయక చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలని నిర్వాహకులు, కమిటీ సభ్యులకు సీఐ బి.వెంకటేశ్వరావు, ఎస్సై పి.నవీన్ కుమార్ గురువారం సమావేశం నిర్వహించారు. డీజె సౌండ్ సిస్టమ్, అశ్లీల నృత్యాలు వద్దని సూచించారు. ఉత్సవాలు ఆరంభం నుంచి ముగింపు వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. విగ్రహం ఏర్పాటు అనుమతికి ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వాట్సాప్ నెం. 79950 95800 కాల్ చేసి పర్మిషన్ పొందవచ్చన్నారు. ప్రతీ విగ్రహం వద్ద ఒక క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంచుతామని సీఐ చెప్పారు.

గ్రామాలలో వినాయక చవితి సందడి

ఉంగుటూరు, సెప్టెంబరు 5: మండలంలో వినాయక విగ్రహాలను బాణసంచా డప్పులతో ఊరేగిస్తున్నారు. చేబ్రోలు వద్ద వినాయక విగ్రహాల తయారీ కేంద్రం నుంచి గురువారం విగ్రహాలను పెద్ద సంఖ్యలో గ్రామాలకు ట్రాక్టర్, ఆటోలపై ఊరేగింపుగా తరలించారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

కుక్కునూరు, సెప్టెంబర్లు 5: పోలవరం నిర్వాసితులకు అన్ని రకాలుగా న్యాయం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నిర్వాసితులతో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నిర్వాసితులకు పరిహారం ఇచ్చి తరలిస్తేనే న్యాయం జరుగుతుందని ఎస్‌కే.గౌస్ అన్నారు. దేవయ్య, జోగయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.






సీఆర్‌ఆర్ కళాశాల అధ్యాపకురాలికి సన్మానం, వట్లూరు ఇంజనీరింగ్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళి, నిడమర్రు, భీమడోలులో ఉపాధ్యాయులకు సత్కారం,

గురువులకు వందనం

● ఘనంగా గురుపూజోత్సవం ● ఉపాధ్యాయులకు సత్కారం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 5: జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో గురుపూజోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పాఠాలు నేర్పిన గురువులను విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న టీచర్లు, అధ్యాపకులను యాజమాన్యాలు దుశ్శాలువాతో గౌరవించాయి. సీఆర్‌ఆర్ కళాశాలలో అధ్యాపకులు ఎ.లావణ్య, సీహెచ్.మహిత, టి.సుబ్రహ్మణ్యంను కార్యదర్శి మాగంటి ప్రసాద్, కొడాలి వెంకట సుబ్బారావు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ప్రిన్సిపాల్ రామరాజు, విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబును ఎస్‌బీఐ బజార్ బ్రాంచి సిబ్బంది సత్కరించారు. వైస్‌ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు పరమేశ, రమేష్, విజయ్‌కుమార్, పద్మావతి, సుష్మలత, సుజాత తదితరులు పాల్గొన్నారు. సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐలో పూర్వవిద్యార్థుల మీట్, ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ రజిత మాట్లాడుతూ కొత్తగా చేరిన విద్యార్థులు కళాశాలలో కోర్సు నైపుణ్యాలను నేర్చుకోవడానికి సమయాన్ని వెచ్చించాలని సూచించారు. రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల అకడమిక్ డీన్ సుబ్రహ్మణ్యశర్మ, హెచ్‌ఆర్ మేనేజర్ లోకేష్, సెట్‌వెల్ అధికారి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: ఉపాధ్యాయులను గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రామచంద్ర కళాశాల ఎండీ కె.సాయిరోహిత్ అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వట్లూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకుల ను జ్ఞాపికలతో సత్కరించారు. ఎండీ సాయిరోహిత్ మాట్లాడుతూ గురువుల సాయంతో జ్ఞాన సముపార్జన సాధించి దేశం గర్వించే పౌరులుగా నిలవాలన్నారు. ప్రిన్సిపాల్ మురళి పాల్గొన్నారు. ఎంఈవో కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

● నిడమర్రు: మండలంలో వివిధ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పత్తేపురం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మరాజు తండ్రి పత్సమట్ల లచ్చిరాజు, ఉపసర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు, పత్సమట్ల లక్ష్మీపతిరాజు, సత్తిరాజు తదితరులు ఉపాధ్యాయులను సత్కరించారు. నిడమర్రు, పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో జనసేన నాయకులు పత్సమట్ల భీమరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించారు. చింతలపాటి బాసిరాజు, మైలవరపు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: విద్యనందించే ఉపాధ్యాయులను సత్కరించడం అందరి బాధ్యత అని మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా భీమడోలులో మానవత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సత్కరించారు. గన్ని వీరాంజనేయులు, ఎంపీడీవో పద్మావతి పాల్గొన్నారు. డిగ్రీ కళాశాలలో తహసీల్దార్ రమాదేవి, ఎంఈవోలు భగవతిదేవి, హెచ్‌ఎం అహ్మద్, తదితరులు ఉపాధ్యాయులను సత్కరించారు.

● చింతలపూడి: మండల విద్యా వనరుల కేంద్రంలో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.శామ్యూల్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ స్థాయి నుంచి రాష్ట్రపతిస్థాయికి ఎదిగిన ఆయన జీవిత విశేషాలను వివరించారు. ఎంఈవో కిరణ్‌బాబు, మురళీకృష్ణ, ప్రభాకర్, జనార్దన్, సుధాకర్‌రావు, వేణు తదితరులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు పెరుమాళ్ళ సంజీవ్‌కుమార్, దారముక్కల రామకృష్ణ దంపతులను చిల్లపల్లి విజయలక్ష్మి ఘనంగా సన్మానించారు. సీహెచ్ రామ్మోహన్‌రావు, చింతనిప్పుల మాధవి, వల్లికృష్ణవేణి, సభ్యులు శివాజీ, పవన్‌కుమార్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: ఉత్తమ ఉపాధ్యాయులను డీఈవో అబ్రహం సన్మానించారు. సింగగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో టి. ప్రభాకర్‌రావు, కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చేపల జయరాజు, కలరాయునిగూడెం పాఠశాలలో చందమాల సాల్మన్‌రాజుకు ఆయన అవార్డులు అందజేశారు. ఎంఈవోలు జంగం రవీంద్ర, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: బాదంపూడి పాఠశాల ఉపాధ్యాయుడు తోట మూర్తిరాజును యూటీఎఫ్ నాయకులు శీతాల సత్యనారాయణ సత్కరించారు. సీహెచ్.శ్రీధర్, జోగినాయుడు, సింగవరపు శ్రీను, ఆనంద కుమార్, బొమ్మిడి ప్రసాద్, సలాది గణేశ్ తదితరులు పాల్గొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి కస్తూరి శిరీష, తల్లాప్రగడ భీమేశ్వరరావు, చిట్టూరి గంగాధరం తదితరులు పూలమాలలు వేశారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టీకే.విశ్వేశ్వరరావు, అధ్యాపకులు ఉప్పాకపాడులో విద్యార్థులు, హెచ్‌ఎం నక్కా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్ పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించి, పాఠశాలకు బీరువా బహూకరించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గుళ్ళపూడి మురళీకృష్ణ, సత్యనారాయణ, బీవీ.సత్యనారాయణ, చిన్ని సాయి, ఇమ్మడి బాలభాస్కర్, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: విద్యార్థులను సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలని గుణ్ణంపల్లి జడ్పీ స్కూల్ ఉపాధ్యాయుడు నీలి శ్రీనివాస్ అన్నారు. జడ్పీ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీచర్ లీలాకుమారిని సత్కరించారు. హెచ్‌ఎం వరప్రకాశం, భారతీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: బండివారిగూడెం పాఠశాల హెచ్‌ఎం డి.బాజా, ఉపాధ్యాయ సిబ్బందిని సర్పంచ్ దంపతులు నాళం శిరీష, కాశీ సన్మానించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మక్కినవారిగూడెం జడ్పీ హైస్కూల్లో గురువారం పాఠశాల పూర్వ విద్యార్థులు 1984-85 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఉపాధ్యాయ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం ఎల్.వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థులు వినుకొండ కుమార్‌రాజు, జగ్గయ్య, వెంకటేశ్వరరావు, విశ్వేశ్వరరావు, వెంకన్నబాబు, పెంటయ్య, ఉపాధ్యాయులు శరత్‌బాబు, రాములు, మంజరీదేవి శ్రీనివాస్, వాసు, సీత, సుమతి, తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఎంఈవోలు టి.రామ్మూర్తి, ఎస్.కల్యాణి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జీసీఎస్ వి.కృష్ణారావు, డీఎస్‌బీ శంకర్‌రావు, ఎస్.పుష్పవతి, ఎం.శిఖామణిని ఎంఈవోలు ఘనంగా సన్మానించారు.

● కొయ్యలగూడెం: విద్యార్థుల మేధాశక్తిని ఉపాధ్యాయులు గుర్తించినప్పుడే ఆ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు వెళతారని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. గవరవరం పాఠశాలలో జరిగిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొన్నారు. నరసింహరాజు, సుభద్రాదేవి, నారా కేశవ, తదితరులు పాల్గొన్నారు. కొయ్యలగూడెం పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. మానవత ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పొంగుటూరు, కన్నాపురం, బయ్యన్నగూడెం తదితర గ్రామాల పాఠ శాలల్లో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు.

● ఏలూరు రూరల్: తన బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పిన ప్రతి ఉపాధ్యాయుడి పేరు తనకు గుర్తు ఉందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశమందిరంలో గురుపూజా దినోత్సవం సందర్భంగా గురువారం పెదవేగి మండల పరిధిలోని పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సత్కరించారు. దొండపాడు పరివర్తన్ దివ్యాంగుల పాఠశాలలో వయోజన విద్య డీడీ జి.ప్రభాకర్ పాల్గొన్నారు. పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి, డీఈడీ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

● పెదవేగి: విద్యనేర్పిన గురువును గౌరవించడం కనీస ధర్మమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. తనకు విద్య నేర్పిన గురువు మద్దూరి సత్యనారాయణ ఇంటికి వెళ్లి శాలువా, పూలదండతో సన్మానించారు. ఎంఈవో కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించి, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈవోలు సీహెచ్.బుధవాస్, వి.అరుణకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను సన్మానించారు.

సెలవు లేకుండా విధుల్లోనే..

దెందులూరు: మండలంలోని గంగన్నగూడెం పాఠశాల ఉపాధ్యాయుడు తుమ్మిడి మురళీ మోహన్‌రావు పాఠశాల జరిగిన 218 రోజులు విధులకు హాజరయ్యారు. సెలవు లేకుండా విధులు నిర్వహించిన ఆయన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఆయనను పలువురు ఉపాధ్యాయులు, ఎంఈవోలు అభినందించారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించి..

బుట్టాయగూడెం: అంకాలపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల హెచ్‌ఎం దారవతు ప్రసన్నదేవి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి నుంచి అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతో ప్రసన్నదేవికి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు దక్కింది. పలువురు ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.






ఏలూరు రూరల్ పరివర్తన దివ్యాంగుల పాఠశాల ఉపాధ్యాయులకు సత్కారం, చింతలపూడిలో రాధాకృష్ణన్ విగ్రహానికి నివాళి, ద్వారకాతిరుమల, కామవరపుకోటలో ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సత్కారం

దాతలు బాధితులను ఆదుకోవాలి : ఎమ్మెల్యే చంటి



రూ.లక్ష చెక్కు అందజేస్తున్న దాతలు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 5: వరద బాధితులను ఆదుకోడానికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎన్‌ఆర్.పేటకు చెందిన రిటైర్డ్ గవర్నమెంట్ హెల్త్ ఆఫీసర్ సిరిపల్లి వసుంధరాదేవి దంపతులు రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే చంటికి గురువారం అందజేశారు.

రూ.2.50 లక్షల విరాళం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితుల సహాయానికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పిలుపు మేరకు తిమ్మాపురం గ్రామ టీడీపీ కుటుంబ సభ్యులు రూ.2 లక్షలు విరాళం అందజేశారు. మండలంలోని ఐఎస్ జగన్నాధపురం, రాఘవాపురం గ్రామ టీడీపీ వారు మరో రూ.50 వేలు విరాళంగా అందించారు.

నిరాశ్రయులకు రేషన్ పంపిణీ

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 5: తమ్మిలేరు వరదతో నిరాశ్రయులైన కుటుంబాలకు తహసీల్దార్ శేషగిరి గురువారం రేషన్ సరుకులు పంపిణీ చేశారు. 47వ డివిజన్‌లో 16 కుటుంబాలకు 25కేజీల చొప్పున బియ్యం, కిలో పంచదార, కిలో కందిపప్పు, లీటరు వంటనూనె, కేజీ ఉల్లిపాయలు, బంగాళదుంపలు అందించారు. కార్పొరేటర్ వందనాల భవాని శ్రీనివాస్, టీడీపీ నాయకులు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

మన్నా చర్చి నిత్యావసర సరుకుల పంపిణీ

వరద బాధితులకు మన్నా చర్చ్ ఆధ్వర్యంలో జ్యోతిరాజు ఫౌండేషన్ సహాయం అభినందనీయమని ఎమ్మెల్యే చంటి అన్నారు. జ్యోతిరాజు ఫౌండేషన్ ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపించారు. వాహనాన్ని బిషప్ ఎలీషారాజు, సిస్టర్ ఎన్.సునీత జ్యోతిరాజు ప్రారంభించారు. ఎస్ఎంఆర్.పెదబాబు, శివప్రసాద్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నిరసన

కొయ్యలగూడెం, సెప్టెంబరు 5: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాస్ కోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రోజురోజుకు నిత్యావసర ధరలు పెరగడం వలన పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, కిరాణ, కూరగాయాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి నిత్యావసర ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయరాజు, రామారావు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. మండల కార్యదర్శి కుంచే వసంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటినా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో అనేక మంది పేదలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వరద బీభత్సం వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తహసీల్దారు కె.స్లీవజోజికి వినతిపత్రం సమర్పించారు. తాళ్లూరి నాగరాజు, ఎర్రగోర్ల సూర్యచంద్రరావు, నాగేశ్వరరావు, అప్పలరాజు, త్రిమూర్తులు, శ్రీను, రామారావు తదితరులు పాల్గొన్నారు.

● వేలేరుపాడు: విపరీతంగా పెరిగిన నిత్యవసర సరుకులు పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని, మండలంలో సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కారం దారయ్య, బాడిస రాము ధర్నానుద్దేశించి మాట్లాడారు. పెదవాగు ప్రాజెక్టు మర మ్మతులకు ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వరద ప్రభావిత గ్రామాలకు కుటుంబానికి రూ.10వేలు తక్షణ సహాయం, బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించాలన్నారు. డీటీ రమేష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న హబీబ్ బాషా

చింతలపూడి, సెప్టెంబరు 5: ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా హెచ్చరించారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రైతులు అడిగిన ఎరువుల కంటే అదనంగా అవసరం లేని ఉత్పత్తులు రైతులకు అమ్మకూడదని, ఇతర పదార్థాలు నిల్వ చేయకూడదని సూచించారు. ఆయన వెంట ఏడీఏ నాగకుమార్, ఏవో మీనాకుమారి ఉన్నారు.

పోషకాహారంపై తల్లులు శ్రద్ధ చూపాలి



పంగిడిగూడెంలో పోషకాహార ప్రదర్శన

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 5: పిల్లలకు పోషకాహారంపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీడీపీవో బ్యూల అన్నారు. పోషకాహార మహోత్సవాల్లో భాగంగా పంగిడిగూడెం సచివాలయ పరిధిలో ఆమె ప్రిస్కూల్ పిల్లల ఆరోగ్యం, విద్య, స్వదేశీ బొమ్మల తయారీ, బొమ్మల ద్వారా విద్య నేర్పించడంపై తల్లులకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారవ తయారీ విధానాలను తల్లులకు వివరించారు. సూపర్వైజర్లు మేరీ, టీచర్లు సుకేశిని, సుమతి, శైలజ, సింధు, నాగలక్ష్మి, సుందరి, ఎఎన్‌ఎం చిన్నారి, దుర్గ, ఆశ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

● భీమడోలు: పౌష్టికాహారం మాసోత్సవాల్లో భాగంగా అంబర్‌పేటలో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యపై సమావేశం నిర్వహించి ఆటపాటల ద్వారా పలు అంశాలు వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్‌కె.నూర్జహాన్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై కళాజాత ప్రదర్శన

చింతలపూడి, సెప్టెంబరు 5: ప్లాస్టిక్ వినియోగించవద్దని మట్టి వినాయకులను పూజించాలని కోరుతూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండు సమీపంలో కళాజాత ప్రదర్శన జరిపారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల నష్టాలను యడవల్లి రమేష్ బృందం వివరించింది.

వరద బాధితులకు చిన్నారుల ఆర్థిక సాయం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 5: చిన్నారులు దాచుకున్న నగదు వరద బాధితులకు అందజేశారు. బుట్టాయగూడెం అరుంధతి పేట పాఠశాల విద్యార్థులు విజయవాడ వరద బాధితుల కోసం రూ.3 వేలను టీచర్స్ డే సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కె.స్వర్ణకుమారి, టీచర్ టి.రమాదేవికి గురువారం అందజేశారు. చిన్నారులను ఎంఈవోలు టి.బాబురావు, అరుంధతిరాయ్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.






భీమడోలు నుంచి ఆహార పొట్లాల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు, పెదపాడు, దెందులూరు మండలాల నుంచి పంపిస్తున్న టీడీపీ నేతలు, ఉంగుటూరులో రైతు సంఘం, ఏలూరులో జనసేన నేతల వితరణ

ఆపన్న హస్తం

విజయవాడ వరద బాధితులకు ఆహారం అందజేత

పెదపాడు, సెప్టెంబరు 5: వరద బాధితులను ఆదుకోవడం మానవ ధర్మమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. వరద బాధితులకు పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే చింతమనేని సహకారంతో పెదపాడు, గోగుంట, వట్లూరు సొసైటీల పరిధిలో పెదపాడులో గుత్తా అనిల్, కుటుంబశాస్త్రి, వట్లూరులో కొమ్మన లక్ష్మణమోహన్ ఆధ్వర్యంలో ఆరు వేల ఆహార పొట్లాలను సిద్ధం చేశారు. వాహనంలో విజయవాడ వరద బాధితులకు గురువారం పంపించారు. చింతమనేని మాట్లాడుతూ వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని, సీఎం చంద్రబాబు ఆదేశాలతో నియోజకవర్గం నుంచి సహాయక చర్యల్లో తగిన సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఉప్పలపాటి రాంప్రసాద్, బొప్పుడి కాశీబాబు, మోరు శ్రావణి, గారపాటి రామసీత, కొత్తూరు చినబాబు, అక్కినేని వంశీకృష్ణ, గారపాటి రామకృష్ణ, ఖండవల్లి జరహో, పొలుపర్తి కన్నారావు, గుండపనేని కళ్యాణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

● భీమడోలు: వరద బాధితుల సహాయార్థం జనసేన కూటమి శ్రేణులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ప్రతి మదన్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణుల ఆర్థిక సహాయంతో సమకూర్చిన పండ్లు, బిస్కెట్లు, వాటర్ ప్యాకెట్లను పంపిణీకి సిద్ధం చేశారు. వాహనాన్ని ఎమ్మెల్యే ధర్మరాజు జెండా ఊపి ప్రారంభించారు. వరద బాధితులను ఆదుకునేందుకు నియోజకవర్గం నుంచి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● దెందులూరు: టీడీపీ, సహకార సంఘం, నాయకులు పెద్ద ఎత్తున స్పందించారు. దెందులూరు, సీతంపేట, జోగన్నపాలెం, ఉండ్రాజవరం పోతునూరు సహకార సంఘాలతో పాటు గాలాయగూడెం పేరాంటలమ్మ ఆలయం నుంచి ఆహార పొట్లాలు విజయవాడ వరద బాధితులకు పంపించారు. సోమవరప్పాడు, గోపన్నపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు ఆధ్వర్యంలో వ్యాయమ కళాశాల, అంగన్వాడీ, ఆశ, పంచాయతీ, టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు ఆహారం ప్యాకింగ్ చేసి వాహనాల్లో పంపించారు. మోతుకూరి నాని, గారపాటి కొండయ్యచౌదరి, బోడేటి మోహన్‌బాబు, ఏనుగు రామకృష్ణ, యిప్పిలి వెంకటేశ్వరావు, నున్న లక్ష్మణబాబు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: విజయవాడ వరద బాధితులకు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతులు రెండు వేల పులిహోర పొట్లాలతో ట్రక్కు ఆటోలో తీసుకెళ్లారు. కైకరం గ్రామంలోని తూర్పు వీధి ప్రజలు విరాళాలు సేకరించి ఆహారం సిద్ధం చేశారు. కె.శ్రీనివాస్, గుత్తికొండ వెంకట కృష్ణారావు, కొర్ని అప్పారావు, చిత్తా వెంకటేశ్వరరావు, పి.రత్నం, కె.నాగరాజు, కన్నూరి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో సుమారు పదివేల మందికి ఆహార పదార్థాలు, వాటర్ బాటిల్స్, బ్రెడ్లు, పండ్లు అందించేందుకు నడుం బిగించారు. ఆహార పదార్థాల వాహనంతో జనసేన పార్టీ కార్యాలయం నుంచి కార్యదర్శులు, నాయకులు బయల్దేరి వెళ్లారు. అప్పలనాయుడు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో వరద ముంపుప్రాంత బాధితులకు ఆహారాన్ని అందించేందుకు జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలను అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరి సాయితేజశ్విని, నగర అధ్యక్షుడు ఎస్.కాశీనరేష్, రెడ్డి గౌరీశంకర్, డి.రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెదవేగి: వరద ప్రభావంతో సర్వం కోల్పోయి, ఆకలితో అల్లాడుతున్న బాధితులకు ఆహారం అందించడానికి ఊరూవాడా ఏకమయ్యాయి. ఆహారం సిద్ధంచేసి, పొట్లాలు కట్టి, విజయవాడకు తరలించే ఏర్పాట్లు చేశారు. పెదవేగి, ముండూరు, విజయరాయి, కొప్పాక సొసైటీల ఆధ్వర్యంలో పదివేల మందికి ఆహారాన్ని తయారుచేసి, వరద బాధితులకు పంపించారు. ఎమ్మెల్యే ప్రభాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో ఆహార పొట్లాలు విజయవాడలోని వరద బాధితులకు పంపించారు. ప్రభాకర్ మాట్లాడుతూ వరద బాధితులకు జగన్, అతని అనుచరగణం తప్ప ప్రతి ఒక్కరూ వరద బాధితులకు అండగా నిలిచారన్నారు. సాయం చేయడం చేత కాని, మనస్సురాని జగన్ విమర్శలు చేయడానికి మాత్రం ముందే ఉంటాడని చింతమనేని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, శ్రీరామ్మూర్తి, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



కైకలూరులో విరాళాలు సేకరిస్తున్న టీడీపీ నేతల

కైకలూరు, సెప్టెంబరు 5: వరద బాధితుల కోసం కైకలూరు టీడీపీ నేతలు గురువారం విరాళాలను సేకరించారు. వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సును కోరుకు నేవారందరూ విరాళాలను అందజేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేస్తామన్నారు. అనేకమంది ప్రజలు, వ్యాపారస్థులు స్వచ్ఛందంగా విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చారు. టీడీపీ నేతలు పీజేఎస్ మాల్యాద్రి, పి.లక్ష్మీరాణి, ఎండీ జానీ, ఎండీ ఉస్మాన్, జి.ఏసురాజు, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కె.వీరరాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : దేవపూడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వైసీపీ నాయకుడు కె.మహేష్ రూ.50 వేల చెక్కును గురువారం తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అందజేశారు.

లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు తొలగింపు

కలిదిండి, సెప్టెంబరు 5 : లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు తొలగింపునకు సర్పంచ్ మారుతి ప్రసన్న, పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. జేసీబీతో డ్రైనేజీ పూడికను తీయిస్తున్నారు. ఆదర్శనగర్, బస్టాండ్ సమీపంలో ఉన్న నీటిని తొలగిస్తున్నారు. ఎంపీడీవో దినతేజ్ వరద నీటి తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్నారు.

సీపీఐలో చేరిన రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

నూజివీడుటౌన్, సెప్టెంబరు 5: సీపీఎం అనుబంధ రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహ తన అనుచరులతో గురువారం సీపీఐ చేరారు. నూజివీడు అమర్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య, సీనియర్ కె.నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సీహెచ్.వెంకట రామారావు నరసింహకు సీపీఐ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఘనంగా ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



నూజివీడు, సెప్టెంబరు 5: రావిచర్లలో మాజీ ఏఎంసీ ఛైర్మన్, సర్పంచ్ కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రబోధానంద సేవా సమితి పర్యవేక్షణలో 11 రోజులుగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. త్రైతసిద్ధాంత కార్యకర్తలు, కృష్ణభక్తులు పెద్దసంఖ్యలో గురువారం కృష్ణాష్టమి ముగింపు వేడుకలు నిర్వహించి, స్వామివారిని ఊరేగించారు.

మొక్కజొన్న పంటకు మొలకలు

చాట్రాయి, సెప్టెంబరు 5: ఎడతెరిపి లేని భారీ వర్షాలకు మండలంలోని చనుబండ శివారు సూరంపాలెంలో కల్లం మీద ఉన్న, కౌలురైతు గురజాల చెన్నారావుకు చెందిన మూడు ఎకరాలలో పండిన మొక్కజొన్న కండెలకు మొలకలు వచ్చాయి. మొక్కజొన్న సాగు కోసం అప్పులు చేశానని, భారీ వర్షాల కారణంగా పంట మొత్తం సర్వనాశనమై రూ.రెండు లక్షలు నష్టం జరిగిందన్నారు. తనకు కౌలురైతు కార్డు ఉన్నందున వ్యవసాయ సిబ్బంది ఈక్రాప్ కూడా చేశారని ఉన్నతాధికారులు స్పందించి తనకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు చెన్నారావు కోరుతున్నారు.

వినాయకుడి విగ్రహాల పంపిణీ



కలిదిండి, సెప్టెంబరు 5 : వినాయక చవితి పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాలకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆర్థిక సాయంతో అందించిన వినాయకుడి విగ్రహాలను కూటమి నాయకులు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కనకదుర్గ, డీసీ మాజీ ఛైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయన, ఎస్సీ సెల్ అధ్యక్షులు కురేళ్ల ఏడుకొండలు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కైకలూరు, సెప్టెంబరు 5: కొల్లేరు గ్రామాలకు వరద ముంపు వస్తున్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ ఉదయభాస్కరరావు అన్నారు. కొల్లేరు గ్రామాలైన పెంచికలమర్రు, సర్కారుకాలువ, గోకర్ణపురం నుంచి పైడిచింతపాడుకు వెళ్లే రహదారి, కొట్టాడ శివారు పల్లిపాలెం, ఉప్పుటేరు ప్రాంతాలను టీడీపీ రాష్ట్ర వడ్డీసాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు, మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు ఆధ్వర్యంలో గురువారం ముంపు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రోజురోజుకి కొల్లేరులో వరద పెరుగుతున్నందున మత్స్యకారులు వేటకు వెళ్ల వద్దన్నారు. గోకర్ణపురం నుంచి పైడిచింతపాడు వెళ్లే రహదారి నాలుగుచోట్ల ముంపునకు గురైందని ఆ ప్రాంతంలో ప్రజల రాకపోకలను నిలిపివేస్తామన్నారు. కొల్లేటికోట పీహెచ్‌సీలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. కూటమి నాయకులు కొల్లి వరప్రసాద్, జయమంగళ సుబ్బరాజు, కొల్లేరు నాయకులు బలే సముద్రుడు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు జిల్లా ఉత్తమ పాఠశాల అవార్డు

ముసునూరు, సెప్టెంబరు 5: స్థానిక గురుకుల బాలికల పాఠశాలకు జిల్లా ఉత్తమ పాఠశాల అవార్డు దక్కింది. గురువారం జిల్లా కేంద్రం ఏలూరులో జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం అధ్యక్షతన జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, జిల్లా ఎస్పీ ప్రతాప్‌కిషోర్, ఎమ్మెల్యే బడేటి చంటి చేతులు మీదుగా ఈ అవార్డును ప్రిన్సిపాల్ కె.ప్రవీణ అందుకున్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినందుకు ఈ అవార్డును అందజేసినట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు. ఏస్ఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది ప్రవీణను అభినందించారు.

రైతుల చొరవతో తొలగిన కిక్కిస

ముదినేపల్లి, సెప్టెంబరు 5 : పెదగొన్నూరు గ్రామ రైతులు పెదలంక మేజర్ డ్రైన్‌లో దేవపూడి వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటు కాడను, ఆవకూరు వంతెన వద్ద పెరిగిన కిక్కిసను తొలగించి ముంపు సమస్యను పరిష్కరించుకునేందుకు మార్గం సుగమం చేసుకున్నారు. వారం రోజులుగా ఈ మేజర్ డ్రైన్ కింద సుమారు మూడు వేల ఎకరాల ఆయకట్టులోని వరి నాట్లు ముంపులో ఉండటంతో టీడీపీ నాయకులు జి.వేణు, పి.దుర్గా ప్రసాద్, సీహెచ్.భాస్కరరావు ఆధ్వర్యంలో రైతులు స్వచ్ఛందంగా డెక్క, కిక్కిస తొలగింపు పనులు నిర్వహించారు. కోరుకొల్లుకు చెందిన జనసేన నాయకుడు సీహెచ్‌శ్రీకాంత్ ఏర్పాటు చేసిన జేసీబీతో ఆవకూరు వంతెన వద్ద కిక్కిసను రైతులు తొలగించారు. ఏఈ భోగేంద్ర ప్రసాద్ పర్యవేక్షించారు.

జనసేన జెండాకు అవమానం

ఆగిరిపల్లి, సెప్టెంబరు 5: మండలం వైసీపీ యువజన అధ్యక్షుడు బెజవాడ హర్షసన్ ఆఫ్ బెజవాడ రాంబాబు మరి కొంతమంది ఈ నెల 2వ తేదీ రాత్రి 12 గంటలకు మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు ఎం.మహేష్ కారుకి అలంకరించిన జనసేన జెండాపై మూత్ర విసర్జన చేసి అవమానపరిచాడు. ఈ దుశ్చర్యను అక్కడే ఉన్న జనసేన మండల ఉపాధ్యక్షుడు పిన్నమరెడ్డిపల్లి వాస్తవ్యుడు యలమర్తి సువర్ణబాబు ప్రశ్నించగా దురుసుగా సమాధానం చెప్పి కులం పూరుతో దూషించాడు. దీనిపై యలమర్తి సువర్ణబాబు పోలీస్‌లకి ఫిర్యాదు చేయగా నేరం చేసిన వారి పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు ఏలూరు రేంజ్ డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ముంపులో వరి పొలాలు

కలిదిండి, సెప్టెంబరు 5 : మండలంలో కొచ్చెర్ల, కోరు కొల్లు, సానారుద్రవరం, గోపాలపురం, వెంకటాపురం గ్రామాల్లో సుమారు 1500 ఎకరాల్లో వరి పైరు నీట మునిగింది. పంట పొలాల్లో వరద నీరు బయటకు పోయే పరిస్థితి కనిపించటం లేదని మురుగు కాల్వలో నీరు ఎక్కువగా ఉండటంతో పంట పొలాల్లో వరద నీరు రోజుల తరబడి ఉండటంతో వరి పంట దెబ్బతింటుందని వాపోతున్నారు. ఏవో విద్యాసాగర్ నీటమునిగిన వరి పొలాలను పరిశీలించారు. ముంపునకు గురై దెబ్బతిన్న పొలాల జాబితాను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు.

డ్రైనేజీల సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత

ముసునూరు, సెప్టెంబరు 5: గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీల సమస్య పరిష్కారానికి ప్రధమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా తెలిపారు. పాత పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న ప్రధాన రహదారి, సీసీ రోడ్డు మధ్యలో డ్రైనేజీ అధ్వానంగా మారి, రహదారిపైనే వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో రూ.లక్షలతో సప్తా నిర్మించారు. ఈ పనులను సర్పంచ్ తనయుడు కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి) పర్యవేక్షించారు.

రెక్కలు.. ముక్కలు



ఏలూరు జిల్లా వైసీపీలో వరుస షాక్‌లు
తాజాగా జడ్పీ ఛైర్మన్ భర్త రాజీనామా
జడ్పీ ఛైర్మన్ దారెటు ?
పక్కచూపులు చూస్తున్న పలువురు జడ్పీటీసీలు,ఎంపీపీలు
వైసీపీ ఏలూరు జిల్లా సారథిగా దూలం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు జిల్లాలో వైసీపీ ఫ్యాన్ రెక్కలు ముక్కలవుతున్నాయి. వరుస రాజీనామాలు ఆ పార్టీకి షాక్ ఇస్తున్నాయి. ఒక్కొక్కరుగా పార్టీ నుంచి జారుకుంటున్నా నాయకత్వం మాత్రం పోతేపోని అన్నట్టుగానే ఉంది. నిన్నకాక మొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ఆళ్ల నాని పార్టీ నుంచే నిష్క్రమించారు. తాజాగా జడ్పీ చైర్మన్ భర్త ఘంటా ప్రసాదరావు పార్టీకి రాజీనామా చేశారు. కూటమి వైపు వెళ్ళేందుకు దాదాపు సమాయత్తమయ్యారు. ప్రస్తుత ఎమ్మెల్సీ జయమంగళ రామారావుకు కూడా గేలం వేసినట్టు ఇప్పటికే ప్రచారం సాగింది. వీరితో పాటు మరికొందరు జడ్పీటీసీలు, ఎంపీపీలు పక్కచూపులు చూస్తున్నట్టు సమాచారం.

వస్తాం.. వెళ్తొస్తాం :

గడిచిన రెండు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటకట్టుకున్న వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీ వ్యవహార ధోరణి నచ్చక కొందరు రాజీనామాలు చేస్తుంటే రాజకీయ భవిష్యత్తు కోసం ఇంకొందరు పక్క చూపులు చూస్తున్నారు. ఏలూరు నగర వైసీపీ అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్‌తో ఆరంభమైన రాజీనామాల పర్వం కొనసాగుతూనే ఉంది. అదిలో ఎన్నికలకు ముందే పార్టీ వ్యవహారాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసి అక్కడి నుంచి బయటపడిన సీనియర్ నేత ఎంఆర్‌డీ బలరాం, ఆయన సతీమణి ఈశ్వరిలు టీడీపీలో చేరారు. అక్కడి నుంచి ఒకరు తరువాత ఒకరు నేరుగా వైసీపీ నుంచి బయటకు వస్తూనే ఉన్నారు. బొద్దాని శ్రీనివాస్ రాజీనామాతో పాటు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మంచెం మైబాబు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామాలు చేస్తున్నట్టు బొద్దాని, ఇటు మంచెం మైబాబు లేఖల్లో పేర్కొన్నారు. తరువాత మాజీ మంత్రి ఆళ్ల నాని వైదొలిగారు. వై.ఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి ఆది నుంచి అత్యంత సన్నిహితంగా ఉన్న ఆళ్ల నాని నిష్క్రమణ ఆ పార్టీకి అతి పెద్ద షాక్. దీని తరువాత మేయర్ నూర్జహాన్ దంపతులు పార్టీకి బైబై చెప్పి సైకిల్ ఎక్కారు. వీరిద్దరి బాటలోనే మరో 19 మంది ఏలూరు కార్పొరేటర్లు ప్రయాణించారు. ఏలూరు నియోజకవర్గంలో వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలు వైసీపీ పెద్దలను సైతం దిగ్భ్రాంతికి గురిచేసినా ఇదంతా సర్వసాధారణం అన్నట్టుగా వ్యవహరించినట్టు కనిపిస్తుంది.

జడ్పీ ఛైర్మన్ దంపతుల రూటెటు ?



జిల్లా పరిషత్ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ దంపతులు గడిచిన రెండు రోజులుగా వైసీపీ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆ మేరకు తాజాగా జడ్పీ ఛైర్మన్ భర్త, వైసీపీ బీసీ విభాగం అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పార్టీకి రాజీనామా చేశారు. కొన్నాళ్ళ క్రితం జడ్పీ ఛైర్మన్ దంపతులిద్దరు, మిగతా మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పార్టీ అధ్యక్షుడు జగన్‌తో భేటీ అయ్యారు. పార్టీ స్థితిగతులపై వీరందరితోను అప్పట్లో జగన్ చర్చించారు. అప్పటికే ఆళ్ల నాని పార్టీ నుంచి నిష్క్రమించడం పట్ల జగన్ సైతం అదేంటలా చేశారంటూ నివ్వెరపోయారు. పనిలోపనిగా పార్టీపరమైన చర్చ జరుగుతున్నప్పుడు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఆళ్ల నాని స్థానంలో ఎవరిని నియమించ నున్నామో సూచాయిగా సంకేతం ఇచ్చారు. ఇదే సందర్భంలో ఘంటా ప్రసాదరావునుద్దేశించి మీకు తగినంత గౌరవం లభిస్తుందంటూ సంకేతం ఇచ్చారు. దీంతో అప్పటికే పార్టీ వ్యవహారాలపై ఒకింత గుర్రుగా ఉన్న జడ్పీ ఛైర్మన్ దంపతులు కాస్త మెత్తపడినట్టే కనిపించినా తరువాత వెంటనే మళ్లీ మనసు మార్చుకున్నారు. వైసీపీ నుంచి బయటపడి నేరుగా జనసేనలో చేరేందుకు కొందరు పెద్దలను సంప్రదించారు. అయితే బీసీ సామాజిక వర్గాన్ని దృష్టిలో పెట్టుకుని జడ్పీ ఛైర్మన్‌గా అత్యంత కీలకమైన బాధ్యతలను పార్టీలో మరికొందరు పోటీపడినా కాదని అప్పట్లో ప్రసాదరావును సంతృప్తిపరిచేందుకు ఆయన సతీమణి పద్మశ్రీకి పార్టీ ఆ పదవి అప్పగించింది. పార్టీ అధికారం కోల్పోయిన తరువాత అనేక పరిణామాలు వరుసగా చోటు చేసుకుంటున్న తరుణంలో ఒకానొక దశలో ప్రసాదరావుకు జిల్లా అధ్యక్ష పదవి ప్రతిపాదన కూడా జరిగింది. ఆ తరువాత వెంటనే ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకున్నారు. దీంతో పార్టీ వైఖరి పట్ల ప్రసాదరావు తీవ్ర అసహనానికి, అసంతృప్తికి గురయ్యారు. ఇదిలా ఉండగా జడ్పీ ఛైర్మన్ దంపతులు జనసేనలో చేరేందుకే మొదటి నుంచి ఆసక్తితో ఉన్నారు. ఈ పరిణామాలను అటు టీడీపీ కూడా జాగ్రత్తగా పరిశీలించింది. వాస్తవానికి జడ్పీలో టీడీపీకి ఒక అంకె బలం మాత్రమే ఉంది.మరి అలాంటి పరిస్థితుల్లో జడ్పీఛైర్మన్ పార్టీ నుంచి బయటపడితే ఎలా వ్యవహరించాలని కూడా ఒకవైపు జనసేన సీనియర్లు ఇప్పటికే చర్చించారు. వాస్తవానికి ఘంటా దంపతులు చింతమనేనిపై చాలా కాలం నుంచి తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఒకప్పటి దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి అనుకూలంగా వ్యవహరిస్తూ చింతమనేనిపై అక్రమ కేసులు బనాయించారు. ఈ విధానాన్ని చింతమనేని నేరుగా ఎదుర్కొన్నారు. నువ్వానేనా అనే స్థాయిలో ఎన్నికలకు ముందే వీరి మధ్య సవాళ్ళు నడిచాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు టీడీపీ నేతలు ఛైర్మన్‌ను పార్టీలో చేరేలా అంతర్గతంగా చర్చించినా టీడీపీ పెద్దలు మాత్రం అసలు ఆ వైపే చూడలేదు. ఇప్పటిదాకా జడ్పీ ఛైర్మన్ హోదాలో ఉన్న ఘంటా పద్మావతి వైసీపీకి ఎలాంటి రాజీనామా చేయలేదు. కేవలం ఆమె భర్త మాత్రమే గురువారం రాజీనామా చేశారు.

ఇక ఎంపీపీలు.. జడ్పీటీసీల వంతు

జిల్లా పరిషత్ ఛైర్మన్ వ్యవహారం కాస్తా ఇంకా ఒక కొలిక్కి రాకమునుపే ఉమ్మడి పశ్చిమగోదావరిలోని కొందరు జడ్పీటీసీలు పక్క చూపులు చూస్తున్నారు. దాదాపు 15 మంది వరకు రంగు మార్చుకోవడానికి సంసిద్ధంగానే ఉన్నా తమంతట తాముగా ముందుకొచ్చేకంటే మిగతా పార్టీల నుంచి కచ్చితమైన ఆఫర్ వస్తే చూద్దామన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కొందరు జనసేన వైపు మొగ్గు చూపడం ఆరంభించారు. ప్రత్యేకించి ఒక సామాజిక వర్గానికి చెందిన సభ్యులు ఈ దిశగా ఆసక్తి కనబరుస్తున్నారు. ఎలాగూ జడ్పీ ఛైర్మన్ పద్మశ్రీ కూడా జనసేన వైపే మొగ్గు చూపుతున్నట్టు ఇప్పటికే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో తాము కూడా అదేబాట పట్టాలనే నేపథ్యంలో ఉన్నారు. ఎందుకనంటే జడ్పీటీసీ సభ్యులుగా పార్టీపరమైన చిహ్నంతోనే వీరంతా గెలుపొందారు. అలాగే కొందరు ఎంపీపీలు వైసీపీ నుంచి ఇతర పార్టీల్లోకి జంప్ అవడానికి సిద్ధంగా ఉన్నారు.

దూలంకే పార్టీ పగ్గాలు

కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుకే వైసీపీ జిల్లా అధ్యక్ష పగ్గాలు అప్పగించాలని నిర్ణయించారు. ఈ మేరకు అధికారికంగా నేడో, రేపో ఆదేశాలు వెలువడబోతున్నాయి. జిల్లా పగ్గాలు మోసేందుకు మిగతా వారెవరూ ఆసక్తి ప్రదర్శించకపోవడం ఒక ఎత్తయితే కాపు సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో దూలం వైపే పార్టీ మొగ్గు చూపింది. ఇంతకు ముందు ఖాళీ అయిన కొన్ని జిల్లాల అధ్యక్ష పదవులకు కొందరిని నియమిస్తూ బుధవారం నాడే వైసీపీ జాబితా ప్రకటించింది.

ప్రతీ రైతును ఆదుకుంటాం


వట్టిగుడిపాడులో వరదల వల్ల నష్టపోయిన పంట పొలాలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి పార్థి

నూజివీడు, సెప్టెంబరు 5: పంట నష్ట పోయిన రైతులను ఆదుకుంటామని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడులో వరదల వల్ల దెబ్బతిన్న పంట పొలాలను మంత్రి, అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. గ్రామం లోని ప్రతి రైతు వై.లక్ష్మణరావు తాను 50 ఎకరాల్లో పత్తి పంట వేయగా, సుమారు రూ.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని మంత్రి దృష్టికి తెచ్చారు. దీంతో మంత్రి సదరు రైతు పొలాన్ని స్వయంగా పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ వరద నీరు తగ్గిన తరువాత అధికారులు పంట నష్టాల పై సర్వేచేసి నివేదిక సమర్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

స్వచ్ఛంద సంస్థల సహకారం మరువలేనిది

ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు ప్రజలను ఆదుకునే విషయంలో స్వచ్ఛంద సంస్థల సహకారం మరువలేనిదని, మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులోని కొప్పుల వెలమపేటలో వరద బాధితులకు నిత్యావసర సరుకులను అందించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున సహాయక కార్యక్రమాలు చేస్తున్నా ఈ సహాయ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలుకు స్వచ్ఛంద సంస్థల సహకారం కూడా అవసరమన్నారు. నూజివీడులో 316 కుటుంబాలకు, ముసునూరులో 24 కుటుంబాలకు, ఆగిరిపల్లిలో ఆరు కుటుంబాలకు మొత్తం 346 కుటుంబాలకు 25కేజీల బియ్యం,కేజి కందిపప్పు, లీటరు వంటనూనె, కేజి పంచదార, కేజి చొప్పున ఉల్లిపాయలు, బంగాళదుంపలు, రాష్ట్రప్రభుత్వం తరపున ప్రతి బాధిత కుటుంబానికి అందిస్తున్నామన్నారు. రోటరీ సంస్థ అందించిన వంట పాత్రలను బాధితులకు మంత్రి అందించారు. రెడ్‌క్రాస్ సంస్థ తరపున దెబ్బతిన్న 26 కుటుంబాలకు వంట పాత్రలు, దుప్పట్లను మంత్రి అందజేశారు. నూజివీడులోని ఎరువుల వ్యాపారులు రూ.లక్ష చెక్కును, అలాగే నియోజకవర్గంలోని అంగన్‌వాడీ సిబ్బంది రూ.50 వేలు, జనసేన నాయకులు పి.నాగరాజు రూ.10 వేలు వరద బాధితులకు అందించాలని మంత్రికి అందచేశారు. నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరి, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా కార్యదర్శి బీవీ కృష్ణారెడ్డి, అధికారులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

కలిదిండి, సెప్టెంబరు 5 : సున్నంపూడి, పడమటిపాలె ముంపు బాధితులను 110 మందిని గురువారం పునరావాస కేంద్రాలకు తరలించామని తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో భోజన వసతితోపాటు మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశామన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

ఆగిరిపల్లి, సెప్టెంబరు 5: విజయవాడ శివారు సింగ్‌నగర్, పాయికాపురం, కండ్రికలలో వరద బాధితులకు గురువారం ఆగిరిపల్లి మండలం నుంచి పది వేల ఆహార పొట్లాలు, మంచినీరు పంపిణీ చేసినట్లు రెవెన్యూ అధికారి పీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు.


పెదగొన్నూరు హైస్కూలు తెలుగు పండిట్ వెంకటరత్నంను, ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం పుష్పలతను, అయ్యవారి రుద్రవరం పాఠశాల ఉపాధ్యాయుడు చిరిగిరి పిచ్చయ్య దంపతులను సత్కరిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఉత్తమ ఉపాధ్యాయులకి సత్కారం


ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని కైకలూరులో సత్కరిస్తున్న ఎంపీపీ కృష్ణ

మండవల్లి సెప్టెంబరు 5: అయ్యవారి రుద్రవ రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు సిరిగిరి పిచ్చయ్య ఏలూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఏలూరులో విద్యాశాఖ కార్యాలయంలో గురువారం జరిగిన గురుపూజోత్సవం వేడుకల్లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్నారు.

● ఆగిరిపల్లి, సెప్టెంబరు 5: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం పులి పుష్పలతకు ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం లభించింది. ఏలూరు జిల్లా కలెక్టర్ ఆఫీస్‌లో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస అందుకున్నారు.

● ముదినేపల్లి : జిల్లా స్థాయిలో ఉత్తమ పండిట్‌గా ఎంపికైన పెదగొన్నూరు శ్రీకాజ లక్ష్మీనారాయణ మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు పండిట్ నేతల వెంకటరత్నంను కలెక్టర్ వెట్రిసెల్వి సత్కరించారు. ఏలూరులో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన్ని సత్కరించి మెమొంటో అందజేశారు. ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య, ఎస్పీ కిశోర్ అవార్డు గ్రహీత వెంకట రత్నంను అభినందించారు

● కైకలూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఏడుగురు ఉత్తమ ఉపాధ్యాయులకు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందిన విశ్వనాధుని రామోజీరావులను సత్కరించి, అవార్డులను అందజేశారు. మండలం లోని ఉత్తమ ఉపాధ్యాయులుగా నందమాల మోజేష్, ఎం.సునీత, గాదంశెట్టి వెంకటసీతామహాలక్ష్మీ, బత్తుల డేవిడ్‌రాజు, బలే కృష్ణ, పల్లెం అర్జునరావు, సలీమాబేగంలను సన్మానించారు. ఎంపీపీ అడవి వెంకటకృష్ణమోహన్ ఎంఈవో డి.రామారావు, సర్పంచ్‌లు డీఎం నవరత్నకుమారి, అల్లూరి మంగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను టీడీపీ నేతలు సత్కరించారు. టీడీపీ నేతలు పూల రామచంద్రరావు, వీరాబత్తిన సుధా, దుర్గం శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


పెయ్యేరు టీచర్ చక్రధర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 5: సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నూజివీడు త్రివిధ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయని దేవి, రజిత, ధనలక్ష్మిలను ఘనంగా సత్కరించారు.

● మండవల్లి : స్థానిక గ్రంథాలయం వద్ద గురువారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 136వ జయంతిని, మదర్‌థెరిస్సా 27వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు, మండవల్లి లైబ్రరీయన్ పర్వీన్, అబితాబేగం పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి : ఈదర హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు బి.వేణుగోపాలరావుకు మన హక్కులకై పోరాడు సాధించే ఉద్యమ సంస్థ అధినేత ఎ.సురేష్ అధ్యక్షతన సన్మానం చేశారు. ఈదుల గూడెం హైస్కూల్లో ఎ.వెంకటేశ్వరరావు అధ్యక్షతన సర్పంచ్ చిట్నేని శేషగిరి సన్మానం చేశారు.

● ముదినేపల్లి : మండల స్థాయిలో ఉపాధ్యాయ దినోత్సవం వాయిదా పడడంతో పాఠశాలల స్థాయిలోనే ఉపాధ్యాయులను ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థులు సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని కూడా పాఠశాలల్లో సహచర ఉపాధ్యాయులు సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో టీచర్ల సంఘాల నాయకులు బి.రాజేంద్ర ప్రసాద్, జి.రమేష్, ఎం.సాయిలక్ష్మి, కృపావరం, వెంకటరత్నం, ఐ.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అల్లూరులో ఉపాధ్యాయులను, అంగన్‌వాడీ టీచర్లను నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దావు నాగరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ శ్యామల, వైస్ ఛైర్మన్ లాజరు, సభ్యులు సన్మానించారు. గౌతం హైస్కూల్‌లో సీనియర్ ఉపాధ్యాయుడు కొత్తూరు వెంకట సుబ్బారావును యాజమాన్యం, ఉపాధ్యాయులు సత్కరించారు.

● ముసునూరు : ముసునూరు జడ్పీ పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి బీవీఎస్ సుబ్బారావు, హెచ్ఎం ఎ.సునీతతోపాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులను ఎస్ఎంసీ ఛైర్మెన్, నక్కా యోహాను, టీడీపీ నాయకులు కొండేటి ఉదయ్ కిరణ్(బాబి), తులిమెల్లి రంగరావు, తోట శ్రీనివాసరావు, గార్లపాటి నరసింహారావు, కె.నాగేశ్వరరావు, రెడ్డి కృష్ణ ఘనంగా సన్మానించి, ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు.

విశ్వనాద్రిపాలెంలో సహాయక చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కాల్వ తవ్విస్తున్న తహసీల్దార్ సుభానీ

ముదినేపల్లి, సెప్టెంబరు 5 : పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో అధికారులు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. 'ముంపులో విశ్వనా ద్రిపాలెం-పట్టించుకోని అధికారులు' అన్న శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు స్పందించిన కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, జిల్లా వైద్యశా ఖాధికా రిణి డాక్టర్ శర్మిష్ట ఆదేశాల మేరకు పీహెచ్‌సీ సిబ్బంది వెంటనే విశ్వనాద్రిపాలెం చేరుకుని ముంపు లో ఉన్న ఇళ్లను పరిశీలిం చారు. తహసీల్దార్ సుభా నీ ఆధ్వర్యంలో నిల్వ నీటిని బయటికి పంపేందుకు కాల్వను తవ్వించారు. ఆర్ అండ్‌బీ రోడ్డు వద్ద సర్పంచ్ తాడంకి శిరీష, కూటమి నాయకులు జి.వేణు, టి.రాజేష్, వి.చక్రపాణి, వై.గంగయ్య ఆధ్వర్యంలో తూములు ఏర్పాటు చేయించారు. పారిశుధ్య నిర్వహ ణ, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి ఎం.రాధ, వీఆర్వో ఏడుకొండలు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎం.శ్యామ్ ముంపు నివారణ చర్యలు నిర్వహించారు.

ప్రమాదకరంగా పెద్ద చెరువు కట్ట


పెద్ద చెరువు కట్టకు వేసిన ఇసుక బస్తాలు

ముసునూరు, సెప్టెంబరు 5: చెక్కపల్లి గ్రామంలో ఉన్న పెద్ద చెరువు కట్ట ప్రమాదకరంగా ఉండడంతో ఇసుక బస్తాలతో కట్టను బలోపేతం చేశారు. నూజివీడు ఆర్డీవో భవానిశంకరి ఆదేశాల మేరకు ఇరిగేషన్ ఏఈ సలీమ్ పర్యవేక్షణలో బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి, సర్పంచ్ టి.రాధిక సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇసుక బస్తాలతో బలోపేతం చేశారు. అయితే గురువారం మధ్యాహ్నం సమయంలో ప్రధాన రహదారి దగ్గరలో కట్టకు కన్నం పడి కొద్దిపాటి నీరు వస్తుండడంతో సర్పంచ్ గ్రావెల్‌తో కన్నం పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. చెరువుకు కన్నం పడడంతో చెరువు దిగువున నివసిస్తున్న వారిలో భయాందోళలు వ్యక్తమవు తున్నాయి. సచివాలయ సిబ్బంది, వీఆర్వో నిరంతరం చెరువు కట్టను పర్యవేక్షణ చేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారు లకు తెలియజేస్తున్నారు. మళ్లీ భారీ వర్షాలు కురిసే ఆవకాశం ఉన్నందున అధికార యంత్రాంగాన్ని అప్రమ త్తం చేసినట్లు తహశీల్దార్ రాజ్‌కుమార్ తెలి పారు. టీడీపీ నాయకులు కాటేపల్లి శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ కె.సత్యనా రాయణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కె.పిచ్చియ్య, తదితరులు కట్ట బలోపేతం పనులను పర్యవేక్షిస్తున్నారు.

క్రైం సమాచారం

వాగులో కొట్టుకుపోయి మహిళ మృతి


దొడ్డి లక్ష్మి (ఫైల్)

నూజివీడు టౌన్, సెప్టెంబరు 5: తన అన్నను చూద్దామని ఇంటి నుంచి బయలుదేరి వాగు దాటే కొట్టుకుపోయి ఓమహిళ మృతి చెందిన ఘటన ఆల స్యంగా వెలుగు చూసింది. మర్రపూడికి చెందిన దొడ్డి లక్ష్మి జంగంగూడెంలోని తన అన్న ఇంటింకి శనివారం బయలుదేరింది. ఈక్రమంలో శనివారం భారీ వర్షాల తాకిడికి రామిలేరు పొంగి ప్రవహించగా జంగంగూడెంలో లెవల్ బ్రిడ్జ్ వద్ద రామిలేరు దాటుతూ అదుపు తప్పి వాగులో పడిపోవడంతో లక్ష్మి మృతి చెంది ంది. వాగు వరద ఉధృతి తగ్గడంతో రామిలేరులోని ముళ్ల పొదల్లో లక్ష్మి మృత దేహాన్ని గుర్తించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అక్రమ మద్యం స్వాధీనం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 5: అక్రమంగా మద్యాన్ని రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 167 సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి తెలిపారు. వాహన తనిఖీలు చేస్తుండగా ఒక నిందితుడ్ని అదుపులోకి తీసుకొని 167 సీసాల మద్యా న్ని స్వాధీన పర్చుకొని అతడ్ని కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల పాటు న్యాయమూర్తి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

పింఛన్ సొమ్ము చోరీ

ఆగిరిపల్లి, సెప్టెంబరు 5: నెక్కలంగొల్లగూడెం మహిళా పోలీస్ లలితకుమారి పింఛన్ సొమ్మును చేజార్చుకున్నారు. గతనెల 31న శనివారం పింఛనుదారులకు పంచడానికి రూ.రెండు లక్షల 44 వేలు బ్యాంకు నుంచి తీసుకుని రూ.లక్షా 22 వేల పంపిణీ చేశారు. అనంతరం తన ఆరోగ్యం బాగుండక వర్షం కూడా భారీగా కురుస్తుండటంతో తరువాత రోజు ఇద్దామని ఉద్దేశంతో విజయవాడ సమీపంలోని తన స్వస్థలం దేవి నగరకు వెళ్ళిపోయారు. తరువాత వరద కారణంగా ఆది, సోమవారం ఆ డబ్బులు ఇవ్వలేదు. మంగళవారం మరలా పెన్షన్‌దారులకు పంచటానికి బ్యాగు తెరిచి చూడగా డబ్బు కనబడలేదని తెలిసి ఆగిరిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే బయట రుణం తీసుకుని పింఛనుదారులకు పంపిణీ చేశారు.